# "శుభికే! శిర ఆరోహ"

"పూరీ పాసెంజర్లో వస్తున్నా" నని యేలూరి నుంచి గంగమ్మ రాసిన వుత్తరమూ "నాలుగ్గంటల రెయిలు కార్లో వస్తున్నా" నని కాకినాడ నుంచి రంగమ్మరాసిన వుత్తరమూ, ఆవేళ ఆదివారం కావడంవల్ల వొక్క డెలివరీలోనే అందాయి.

"టపా చూసుకునే మేడమీదికి వెడదా" మనుకుని ఆఫీసుగదిలోనే కూచుని వున్నాడు జగ్గప్ప.

ఏకక్షిదారో, యే బంధువో, యే మిత్రుడో, యే తెనుగు రచయితో రాసిన మామూలు జాబులే వస్తాయనీ, వెంటనే మేడమీదికి వెళ్ళి సుఖంగా నిద్రపోవచ్చుననీ అనుకున్నా డతను.

కాని, దినదినమూ యెన్నో వచ్చే వుత్తరా లివాళ రెండే రావడమూ, ఆ రెండయినా "కజ్జాకి వస్తున్నాం కాసుకో" అన్నట్టిలాగ శ్రీముఖా లయి వుండడమూ చూసి తెల్లపోయి, ఉన్నట్టుండి కుర్చీ కంటుకుపోయా డతను.

ఆ వుత్తరాలతోపాటే వచ్చి బిందెరొట్టెలాగ మేజామీద పడివున్న లా రిపోర్టు పాకెట్టయినా అతణ్ణి ప్రకృతిలోనికి తేలేకపోయింది.

ఈస్థితిలో తాంబూలప్పళ్ళెం పట్టుకుని రత్తమ్మ చక్కా వచ్చింది.

గుమ్మంలో అడుగుపెట్టాటప్పటికే ఆ జడావస్థ కనపడగా "యేమిటా?" అని పరిశీలించడంలో నిశితాలయిన ఆమె చూపులతో ఉద్బుద్ధుడయినా డతను.

ఉత్తరక్షణంలో, ఉభయులూ, ఉత్తరాలూ తాంబూలమూ మార్చుకున్నారు.

చూస్తూ చూస్తూవుండగానే, అతని పెదవులు రాగ రంజితాలు కాగా, ఆమె మొగం భావశబలితం అయింది.

చూసిచూసి వుత్తరాలు బల్లమీద విసిరికొడుతూ "గంగమ్మ వదిన యింత పంతగొట్టుపని చేస్తారనుకోలేదునే" నంటూ రుస రుస లాడిందామె.

"మరి రంగమ్మక్క మాత్రం తక్కువచేసిందా?"

"సడే, ఈవిడగా రివాళ ముహూర్తం పెట్టుకున్నట్టావిడకేం తెలుసునండీ పాపం?"

"ఇది జాలిపడవలసిన సంగతే అయితే, ఆవిడ సంగతి యీవిడకు మాత్రం యేమితెలుసూ?"

ఇది విని ముందు చురుగ్గాచూసి, తరవాత నిదానించి చివరికి "పోనీ, మన మిప్పుడు చెయ్యవలసిం దేమిటో మీకు తెలుసా?" అని ఆత్రంగా అడిగిందామె.

దానిమీద "అదీమాట" అంటూ బల్లగుద్ది, కుర్చీకంటుకుపోయినవాడల్లా సరిగా కూచుని "యిక చెప్పు" అంటూ సావధాను డయినా డతను.

"సరే" అంటూ అప్రయత్నంగా విసుక్కుందామె.

ఏదో ముంచుకు వచ్చేస్తున్నట్టూ, అయినా అదేమీ గమనించకుండా అతను జాప్యం చేస్తున్నట్టూ, కనపడి చిరాకు వచ్చిం దామెకి.

దీంతో మనస్సు చెదిరిపోయి అసలే మరిచిపోయింది.

చివరికి, చకితనేత్రాలతో అప్రయత్నంగా గుమ్మంకేసి చూసి, తలుపులు, దగ్గిరసానే వుండడం గుర్తించి దిటవు తెచ్చుకుని, అతనికి కొంచెం దగ్గిరగా వెళ్ళి, కంఠం నొక్కుకుని "గంగమ్మ వదినతో నేను వేగలేనండీ" అంది దీనంగా.

"మరి రంగమ్మక్క మాటః"

"చాటున చెప్పుకోవాలి. వో ట్టి అమాయికురా లావిడ. నేనంటే ప్రాణం యిస్తుంది కూడానూ"

"కనకః"

"మేనరికం నాకిష్టం లేదనుకుంటున్నా రేమో మీరు"

"కనక, అన్నాను"

"మా అపేక్ష లెలాంటివో మీ అపేక్షలూ అలాంటివే. మిమ్మల్నీ మిమ్మల్నీ దూరం చెయ్యాలని కాదు—"

"తరవాత యేమిటో చెప్పమంటున్నా" నన్నాడు కొంచెం నిలవతీసి నట్టు, జగ్గప్ప.

దానిమీద ముందు ఆమె చకిత అయింది.

ఒక్క క్షణం అతనికేసి రెప్పవెయ్యకుండా చూసింది.

చివరికి, ఆసందుబాట్లో వొక నిశ్చయానికి వచ్చి, ధైర్యమున్నూ పూని "రంగమ్మవదినతో వియ్యం అందడం మీకభ్యంతరం లేకపోతే సుమండీ" అంటూ బుంగమూతి పెట్టుకుని, కుర్చీపీట అతనికి మరీ దగ్గిరసా తీసు కూర్చుంది.

ఆమాటలో "మన యిద్దరి చూపూ వొకటే" అన్న దిలాసా కనపడి, బిగపట్టుకున్న శ్వాస ఆడినట్టయి తేలికపడి "అయితే, మరి, గంగమ్మక్క కేమిటీ చెప్పడంః" అని జిజ్ఞాసతో అడిగా డతను.

అవ్యవధిగా నిరోధించి అడిగినట్టు కాగా దీనికి బదులు చెప్పలేక పోయిందామె.

"ధోరణి చూడగా, వీలుతప్పితే, రగడ పెంచడానికే వస్తున్నట్టు కన బడుతుంది గదా గంగమ్మక్కః" అని మళ్ళీ అడిగా డతను.

అందుకూ ఆమె బదులు చెప్పలేకపోయింది.

"పై పెచ్చు, మాఅమ్మ, గంగమ్మక్కనే పూసుకువస్తుంది కదాః" అన్నా డతను, అపాయం తర్జనితో నిర్దేసించి చూపిస్తున్నట్టు.

"అవును సుమండీ" అంటూ కుంగిపోయింది రత్తమ్మ.

అన్నదే కాని, అనాలనీ అనుకోలేదు, అన్నట్టున్నూ యెరగ దామె.

ఎదురొమ్ము మీదికుంపటిలాగ, షష్టి గడియలూ కలిసివుండక తప్పని అత్తగారు, కత్తులు దూసుకూర్చున్న దనే భ్రాంతి మనస్సు కలిచేసి, హృదయం బద్దలు కొట్టేసి, మెదడున్నూ కరిగించేసిందామెకి.

ఆమె స్థితి గ్రహించి తానూ అలాగే అయిపోయినట్టు మరి మాట్టాడలేక పోయా డతను.

ఏదో వెతుకుతున్న ట్టిద్దరి చూపులూ ఆత్రంగా దుముకులాడ సాగాయి.

ఈ స్థితిలో "నాన్నా రోయ్" అంటూ తలుపులు తోసుకుని లోగుమ్మంలో అడుగు పెట్టి, అక్కడ తల్లికూడా వున్నందున మళ్ళీ తలుపులు దగ్గిరసా లాగి గిరుక్కున మళ్ళీ చక్కాపోయింది వారి రెండోపిల్ల, అన్నపూర్ణ.

దీంతో వారిద్దరూ మళ్ళీ ప్రకృతిలో పడ్డారు.

"అన్నపూర్ణ అయితే గంగమ్మక్కమంకుతనమూ, ఆవిడ కొడుకు టుకూ్కచా-ప్పగా కుదురుస్తుం" దన్నా డతను,

"అసలు, పెళ్ళాడితేనా?" అని యెదు రడిగిందామె.

దీనిమీద, వొకరితరవాత వొకరి కిద్దరికీ చిరునవ్వు వచ్చింది, దొంతరలుగా,

మళ్ళీ అంతలో గాంభీర్యం తెచ్చుకుని "నామాట అలా వుంచండి. పెద్దమ్మాయికి అతను సుతరామూ తగడండి! దాన్నతను బతకనివ్వడండి" అంది రత్తమ్మ.

ఈమాట అన్నప్పు డామెకంఠం గద్గదిక మయింది.

మంచుతెర కప్పిన తామరపువ్వు రేకల్లాగ ఆమెకళ్ళు చెమ్మగిల్లి పోయాయి.

ఇది చూసి, అతనూ ఆర్ద్రికంఠు డయి "గంగమ్మక్క మాట అలా వుండగా, మా అమ్మకుడా నీమీది కోపాన గంగమ్మక్కకీ తాసికలు చెప్పి బాధ పెట్టించదూ పెద్దమ్మనీ?" అన్నాడు జాలిగా.

ఈమాట వినీ వినడంతోటే "మీ అమ్మ కడుపుచల్లగా, వున్నమాట అన్నారండీ మీరు? అందరి వాలకమూ మీకూ తెలుసునండీ! ఇక భయంలేదండీ! నా చిట్టితల్లి కీగండం గడుస్తుందండీ! నా బెంగ తీరిందండీ" అంటూ అతి ప్రేమగానూ, అతి వాత్సల్యంతోనూ అతని చేతులు గట్టిగా పట్టుకుని వూపిరి తీసుకుందామె.

దీంతో అతను ముగ్ధుడయినాడు.

అరమూతలు పడ్డ అతని కళ్ళకి, జానకమ్మకీ గంగమ్మ కొడుక్కీ హస్తికీ మశకానికి వున్నంత అంతరం కనపడింది.

పురోడాశం తీసుకువెళ్ళి కుక్కకి పెట్టినట్టున్నాతోచి స్వగతంగా సీత్కారం కలగ్గా కనుబొమ్మలు ముడిపడ్డాయి.

వెంటనే వొక నిశ్చయానికి వచ్చి "ఇక చాలు, అంతా నేను చక్క చేస్తాను. నువ్వు బెంగపెట్టుకోకు, వెళ్ళు ఉత్తరాలు మాత్రం మాఅమ్మకో మాటు చూపించు" అంటూ తానులేచి, బల్లమీద వుత్తరాలు చేతిలో వుంచి, ఆమెని లేవదీశాడతను.

ఆమె కళ్ళు ఆనంద విస్ఫారితా లయినాయి.

కాని, వుత్తరాలు అత్తగారికి చూపించడం మాట వచ్చాటప్పటికి, ఒక వైపునుంచి కార్యసిద్ధి అవుతూ వుండగా మరో వైపునుంచి కార్యహాని తరుముకు వస్తున్నట్టు తోచి, మొదట ఆమె నిర్విణ్ణ అయిపోయింది.

అయినా, జగ్గప్ప మొగంమీది దృఢదీక్ష గుర్తించి మనస్సు కుదుటపరచుకుని చివరి కావుత్తరాలు మరో మాటు చూసుకుంటూ, అడుగులు మెల్లిగా వేసుకుంటూ వెళ్ళిపోయిందామె.

ఆమె గుమ్మం దాటేదాకా వుండి "చిన్నమ్మా" అని పిలుస్తూ తరవాత అతనూ విసురుగా వెళ్ళిపోయాడు.

## 2

అరుగుమీద కూచుని జగ్గప్పా పురోహితుడూ జానకి పెళ్ళి విషయమే మాట్లాడుకుంటూ వుండగా, మోటారు వచ్చి పోర్టికోలో ఆగింది.

"ఎప్పు డెప్పు" డనుకుంటూ లోగుమ్మంలో యెదురుచూస్తూ నుంచుని వుండిన ముసలమ్మ, వొక్క అంగలో కారు దగ్గిరి కురికి "వచ్చావా అమ్మా?" అంటూ కారులో వుండగానే గంగమ్మ చేతులు పట్టుకుని ప్రేమ గుమ్మరం చేసింది.

గంగమ్మ, కొడుకుని కూడా తీసుకురావడం చూసి, జగ్గప్ప "భారీ యెత్తుమీదేవచ్చా" రనుకుంటూ తలపంకించుకున్నాడు.

"మామయ్యతో మరెవరో వున్నారు. ముసుగు సరిచేసుకోవమ్మా" అని గంగమ్మకి మెల్లిగా చెప్పి, ఆమె కొడుకు, స్వయంగానే అవతలి తలుపు తెరుచుకుని దర్జాగా కారుదిగాడు.

ఈలోపున, కంఠం నొక్కుకుని, కళ్ళు తిప్పుకుంటూ "రంగి కూడా యివాళే వస్తోందే, మించిపోయినట్టూ" అని ముసలమ్మ సాగతీసుకుంది.

కొడుకు చెప్పిన మాటమీద సవరించుకోవా లనుకునిన్నీ, యీమాట విని వులిక్కిపడి, సగంజారి పోయిన ముసు గలాగే వుంచేసుకుని "అదెందుకే

యిప్పుడు శనిలాగా?" అని మెల్లిగానే రుంజుకుంటూ కొడుకుకంటే నింపాదిగా కారుదిగింది గంగమ్మ.

కారు తిరగవేసుకుని కొడుకువచ్చి కలుసుకున్నాక, తల్లి బుజాన చెయ్యివేసుకొని గోటుగా బయలు దేరిం దామె.

వారు మెట్లమీద అడుగు పెట్టాటప్పటికి లేచివచ్చి "వచ్చారా" అని అక్కనీ, మేనల్లుణ్ణీ పలకరించాడు జగ్గప్ప.

గంగమ్మ, అందుకు జవాబుగా మొదట చిరునవ్వు మొలిపించుకుంది.

తరవాత "ఇవాళ, బండి అరగంట లేటు" అని చెప్పి, కొడుకేసి చూసింది; కాని అతను చిరునవ్వుమాత్రం ప్రసాదించి వూరుకున్నాడు.

ముగ్గురూ అరుగెక్కారు.

గంగమ్మా, ముసలమ్మా సింహద్వారం దగ్గిరపా నుంచోగా, గంగమ్మ కొడుకు జగ్గప్ప కెదురుగా నుంచున్నాడు.

జారిపోతుందా అన్నట్టు వొదులు వొదులుగా బిళ్ళగోచీపెట్టి పంచె కట్టుకునీ, దానిమీద మోకాళ్ళదాకా పల్చని బెంగాలీ లాల్చీ వేసుకునీ, దాని మీద హిందూస్థానీ పొట్టికోటు తొడుక్కునీ, నెత్తిన లేసుగుడ్డ టోపీ పెట్టుకునీ వున్నాడతను.

బీడీ వొకమాటు నోట వుంచుకుని పీలుస్తూ, వొకమాటు తీసేసుకుంటూ, మధ్యమధ్య రకరకాలుగా పొగ విడుస్తూ, ఫ్రెంచి కట్టింగు మీసాలు కూడా సవరించుకుంటూ పోజుమీద పోజుకూడా మారుస్తూ వున్నాడతను.

"ఈవిడ మా పెద్ద అక్కగారు. ఇతను మా మేనల్లుడు" అంటూ వారిని పురోహితునికి పరిచయం చేశాడు జగ్గప్ప.

"చిత్తం చిత్తం, అక్కయ్యగారినిచూసి పదేళ్ళయింది. అప్పుడయినా, అప్పుడే నాకు తమ ఆశ్రమం లభించడంవల్ల కొత్త అయిపోయింది. నాటికి నేడూ మళ్ళీ వారి దర్శనం. చాలా సంతోషం" అని వూగీసలాడుతూ బదులు చెప్పాడు పురోహితుడు.

"మొన్నటిదాకా కలకత్తాలో చదివాడు, కాని ప్రస్తుతం కాశీలో చదువుతున్నాడితను"

మళ్ళీ "చిత్తం చిత్తం" అని జగ్గప్పకి వినయం నివేదించు కుంటూనే గంగమ్మ కొడుక్కేసి తిరిగి "మీపే రెవరు నాయనా?" అనడిగాడు పురోహితుడు.

"రామేష్" అని చెప్పాడు గంగమ్మ కొడుకు.

అరవై యేళ్ళ పురోహితున కిది తెనుగు జాతిలో వినపడి వుండని పేరు.

ఉలిక్కిపడ్డాడతను.

ఇది గుర్తించి, చర చర చూసి, మొగం పక్కకి తిప్పుకున్నాడు జగ్గప్ప.

దాంతో కొంచెం పురెక్కి "యేమిటి నాయనా?" అంటూ చెవులోరజేసుకుని మళ్ళీ అడిగాడు పురోహితుడు.

"రామేష్" అన్నాడు కరుగ్గా, గంగమ్మ కొడుకు.

ఈ మాటు కొంచెం పెంకితనం కనబరిచాడతను.

పైగా, యీమాటు పేరు చెప్పినప్పుడు షకారం కొంచెం దీర్ఘంగాపలికి, దాంతో చిన్న యీలవంటి సన్నని ధ్వని కూడా పుట్టుకు వచ్చింది.

జగ్గప్ప తనలో నవ్వుకున్నాడు.

రెండుమాట్లు విన్నా అపే రేమిటో అర్థం చేసుకోలేక గంగమ్మ కేసి తెల్లపోయి చూసింది ముసలమ్మ.

"వొట్టి కూపకూర్మాలు" అన్నట్టు మొదట కొడుక్కేసి సగర్వంగా చూసి, తరవాత, తన అలతి నవ్వుతో ముసలమ్మ మొగం పులిమింది గంగమ్మ.

"బాగుంది నాయనా" అని రామేష్‌ని అభినందించి, ముసలమ్మ కేసి చూస్తూ "తాతగారిపేరు——" అంటూ మాట తేల్చేశాడు పురోహితుడు.

అది పుండుమీద కారపుగుండ కొట్టినట్టయింది ముసలమ్మకి.

దాంతో "మధ్య నువ్వేమిటయ్యోయ్?" అన్నట్టొక చురుకుచూపు పురోహితునిమీద పారేసి, ముసలమ్మ ధుమ ధుమ లాడుతూ మొగం పక్కకి తిప్పుకుంది.

ఈ సందుబాట్లో- రామేష్ ఉ "ముసుగు సరిజేసుకో" అన్నట్టు తల్లి కేసి చురుగ్గా చూడడమూ, కంగారుపడుతూ ఆమె ముసుగు ముందుకి లాక్కోడమూ గబగబా జరిగిపోయాయి.

అది కూడా చూసి మెరుపు కొట్టినట్టయి, పురోహితుడొక్క అడుగు వెనక్కి వేశాడు.

"ఇక వీళ్ళ నిక్కడ వుండనివ్వడం మంచిదికా" దని వూహించి, జగ్గప్ప, లోపలికి పదమందా మనుకుంటూ వుండగా "ఇదిగో, వదినగారే? ఎన్నాళ్ళ కెన్నాళ్ళకీ! దయచెయ్యండి, దయచెయ్యండి" అంటూ వూచలాగ వచ్చి, రత్తమ్మ, గంగమ్మ చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకు వెళ్ళింది.

"రావోయ్! నాయనా?" అని పిలుస్తూ వారి వెనక ముసలమ్మా, వొక్కపీల్పు పీల్చి బీడీ పోర్టికోలోకి విసిరేసి ముసలమ్మ వెనకనే రామేష్ ఊ లోపలికి వెళ్ళారు.

చిరునవ్వు నవ్వుతూ పురోహితు డేదో అనబోయాడు: కాని అంతకి ముందే "చిన్నక్కయ్యగారు కూడా వస్తున్నారు, పెద్ద స్టేషనుకి వెళ్ళు" అని డ్రయివరుకి ఆజ్ఞాపించి, కూడారమ్మని పురోహితుణ్ణి కళ్ళతోపిలిచి, సన్నజాజి పొదకేసి దారితీశాడు జగ్గప్ప.

"చిత్తం" అంటూ వినయం కనపరిచి జగ్గప్ప కొంచెం అవతలకి వెళ్ళేదాకా నుంచుని, తరవాత బుర్రుమనిపించుకుంటూ కారు నడిపించుకు పోయాడు డ్రయివరు.

## 3

గంగమ్మా రంగమ్మా వచ్చింది పెళ్ళికూతురి చూపులకేగాని, ఆర్రాత్రి భోజనాల బంతి పెళ్ళిబంతిలాగే వుంది.

ముసలమ్మా గంగమ్మా రామేష్ ఊ వొకపక్కనీ, జగ్గప్పా రత్తమ్మా జానకీ అన్నపూర్ణా, రంగమ్మా ఆమెకొడుకు రామేశమూ వొక పక్కనీ కూచున్నారు.

"ఈ యేర్పాటు మా అమ్మదా?" అని రత్తమ్మని కళ్ళతో అడిగి, జగ్గప్ప, మొగం వంచుకుని ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు.

"మొగపెళ్ళివారు కామోసు నాయనోయ్" అన్నట్టు కొడుకేసి చూసి, రంగమ్మ, కళ్ళల్లోనే నవ్వుకుంది.

రామేష్ కేసీ, గంగమ్మ కేసి, కొంటె చూపులుగానూ ముసలమ్మ కేసి కోరచూపులుగానూ, అన్నపూర్ణ నేత్రావధానం చేస్తోంది.

చూపు లిటే వుంచి గంగమ్మా రామేష్ ఊ హిందీలో మాట్లాడు కుంటున్నారు.

అదిచూసి "మీవియ్యపు రాలెంత తెలివయిందో చూసుకోం" డన్నట్టొకమాటూ "మీ అల్లు డెంత గొప్పవాడో తెలిసుకున్నారా?" అన్నట్టొకమాటూ, ముసలమ్మ, జగ్గప్పని విడిచి రత్తమ్మనీ రత్తమ్మని విడిచి జగ్గప్పనీ డెకాయించి నట్టు చూస్తోంది.

ఇది యిలా జరుగుతూ వుండగా, అందరికీ వ్యంజినాలూ అన్నమూ వడ్డించి, రామేష్‌కి మాత్రం గోధుమ రొట్టెలూ, బంగాళాదుంపల వేపుడూ, పంచదారా వడ్డించింది వంటలక్క.

అందుకే జగ్గప్ప వింతపడుతూ వుండగా "ఇప్పణ్ణుంచీ అలవాటు కాకపోతే ముందుముందు కష్టం, జానకమ్మకూ్కడా రెండురొట్టెలు వెయ్యవమ్మా" అని పురమాయించింది, ముసలమ్మ, వంటలక్కకి.

అది విని యీబంతి వారందరూ యేకకాలంలోనే చకితు లయినారు.

ఎగిరిపడి అన్నపూర్ణ జానకమ్మ కేసి చూడగా, జానకమ్మ, ముసలమ్మ మొగాన చూపులతో మెటికలు విరిచి మొగం వంచుకుంది.

జగ్గప్పా, రత్తమ్మా లోపల్లోపల నవ్వుకున్నారు.

రంగమ్మ వారి యింగితం కనిపెట్ట సాగింది.

ఒక్క నిమిషం గంభీరంగా గడిచిపోయింది.

ముందొకమాటు రామేశంకేసి కొంటెచూపు చూసి, కంఠం కూడా సవరించుకుని, తరవాత రామేష్ని వరసపెట్టి పిలిచి మెల్లగా ప్రారంభించాడు జగ్గప్ప.

"నీకు రొట్టెల అలవా టెప్పణ్ణుంచోయ్?"

"కలకత్తా వెళ్ళినప్పణ్ణుంచీని"

"ఎందు కయిందీ?"

"దాని కది కాలేదు, కోరి నేనే చేసుకున్నాను"

"ఎందుకోసం?"

"వెధవది, వరి అన్నంలో యేముంది మామయ్యా?"

"మన కది యివాళ కొత్తటోయ్?"

"పాత అయితే మాత్రం తెలిశాక కూడా తప్పు చెయ్యడమా?"

"ఇది తప్పే అంటావా?"

"ఇంకా సందేహమా?"

"ఎంచేతా?"

"ఉత్తరదేశంలో వరి అన్నం యెవరూ తినరు కనక"

"అయితే?"

"అది వో - ట్టి తుక్కు. పశువుల కయినా పనికిరాని చెత్త"

రంగమ్మ, గంగమ్మ విస్తరికేసి చూసింది.

అది యీదెబ్బతో పొడిచినట్టు కాగా గంగమ్మ అందుకుని "నాయన చెప్పినప్పణ్ణుంచీ నేనూ గోధుమరొట్టెలే తింటున్నాను; కాని మీరు దేవుళ్ళాడిపోతారని యిక్కడ మాత్రం వరి అన్నమే తింటున్నాను." అని రత్తమ్మకి చెప్పి, రంగమ్మకేసి యెర్రగానూ, కొడుక్కేసి విజయగర్వంతోనూ చూసింది.

అందరూ ఆమెని చూసి వూరుకున్నారు.

ఉండుండి "ఉత్తరదేశంవాళ్ళకి మనకి యేమి సాపత్యమోయ్ దీల్లోనూ?" అని మళ్ళీ అడిగాడు జగ్గప్ప.

"సాపత్యం లేకపోబట్టే మనం యిలా వున్నాం"

"వాళ్ళ విశేషం యేమిటీ?"

"వాళ్ళే నికర మైన హిందువులు. మనం కూడా గోధుమ రొట్టెలు ప్రారంభించినప్పుడే వారితో సమాన మవుతాం"

"అక్కడ ముస్లిములుకూడా గోధుమరొట్టెలే తింటారు కామోసు మరి?"

ఇలా అడిగి జగ్గప్ప రామంకేసి కళ్ళు చికిలించుకుంటూ చూశాడు; కాని యిందులోవున్న విశేషం గుర్తించలేక — అసలు, విశేషం యేమయినా వుందేమో అనయినా ఆలోచించకుండా "అవును, తింటారు" అనేసి వూరుకున్నాడు రోమేష్ ఉ.

రామేశం మేనమామకేసి చూసి మందహాసం చేశాడు.

వడ్డన పూర్తి కాగా, భోజనా లారంభమైనాయి.

అందరికీ మామూలుగా వడ్డించి, రొమేష్‌కి నెయ్యి వెయ్యాలో అక్కర్లేదో, వేస్తే యెక్కడ వెయ్యాలో తెలవక అతని దగ్గిర నుంచుని వుండి పోయింది వంటలక్క.

అది విడ్డూరంగా కనపడగా యీబంతివారందరూ రెప్ప వెయ్యకుండా అటు చూశారు.

రొమేష్ కూడా చూసిచూసి "అక్కర్లే"దన్నాడు.

ఇది విని యివతలి బంతి వారందరూ గతుక్కుమన్నారు.

అంతటితో వూరుకోలేక, వెంటనే అందుకుని "ఉత్తరదేశం వాళ్ళ దృష్టిలో నెయ్యికూడా వో-ట్టి తుక్కేనా యేమిటోయ్?" అనడిగింది, మెల్లిగా రత్తమ్మ.

దీనిమీద రంగమ్మా రామేశమూ సోత్సాహులై చూసుకున్నారు.

నెయ్యి లేకుండా భోజనం చెయ్యడం ముసలమ్మకి అగాయిత్యంగానే కనపడింది. దాంతో "వేయించుకో నాయనా" అన్నమాట నాలుక చివరికి కూడా తెచ్చుకుంది; కాని యేముంటే యేమిటో అని సాహసించలేక గంగమ్మ కేసి బిక్కుబిక్కు చూసింది.

అది అన్నపూర్ణకి లోకు విచ్చింది.

వెంటనే ఆమె అందుకుని "రొట్టెలు తినడం అలవాటు చేసుకోమన్నట్టే,

నెయ్యి లేకుండా భోజనం చెయ్యడం కూడా అలవాటు చేసుకోమంటావా యేమిటి నాన్నమ్మా, అక్కయ్యనీ?" అంటూ సాగతీసుకుంది.

దీనిమీద పకాలుమని నవ్వేరాగా, అతికష్టంమీద ఆపుకోడంలో రంగమ్మకి బాగా కొలక మారింది.

జగ్గప్ప కంఠం బిగించుకునీ మూతి బిడాయించుకునీ నవ్వాపుకోగా, రామేశం దగ్గుతో కలిపి నవ్వేశాడు.

"మహాబాగా అడిగావు" అన్నట్టు తల సుతారంగా పంకించుకుంటూ చిన్నకూతుర్ని మెప్పుగా చూసింది రత్తమ్మ.

మొదట "యేదో పోనిస్తూ" అన్నట్టూరుకున్నాడు; కాని, రామేష్ ఉ, చివరికి కొంచెం వుడికినట్టయి తల్లితో హిందీలో యేమిటో అన్నాడు.

ఇదంతా గంగమ్మకి వుక్రోషం కలిగించింది.

ఊరికే చుట్టపు చూపుగా మాత్రమే వచ్చివుండే, ఆమె కూడా, హిందీలో యెంతెంతలేసి మాటలయినా అనేసి వుండును; కాని, సమయం కాక వస్తాయించి వూరుకుంది.

అప్పటికి 'మూడుముళ్ళూపడనియ్యి తగిన జవాబు చెబుతాడు నీ"కన్నట్టు రత్తమ్మ కేసి వోరగా కోరచూపులు చూసింది.

అంతటితో కూడా వూరుకోలేక, చివరికి "నా నాయనకి తెలిసిన ట్టెవరికి తెలుసూ? అతనికి వంకలు పన్నాలంటే యెంతవాళ్ళు కావాలీ?" అంటూ కళ్ళు తిప్పకునిముసుగు మరింత ముందుకి లాక్కుంది.

దీంతో పరిసరాలు కలుషితాలయినట్టు కనపడ్డాయి.

ఈ సంభాషణకి అతీతురాలయి వున్న వంటలక్క అది పసికట్టేసింది.

రసభంగం కావచ్చు నని శంకించి, ఆమె, వెంటనే "చింతకాయ పచ్చడి, చింతకాయ పచ్చడి" అనడుగుతూ యెవరకీ వడ్డించకుండానే బంతి అంతా గిర్రున తిరిగేసి తుర్రుమని వంటింటోకి చక్కా పోయింది.

ఇది సరిగా పనిచేసింది.

మంత్రించినట్టు అందరి మొగాలూ విడ్డాయి.

ముఖ్యంగా, రామేష్ మనస్సు కొంచెం వురకలు వేసింది.

వెంటనే బదులు తీర్చుకోవాలని వుబలాటపడి, అతను "చింతకాయ పచ్చడికీ నువ్వుల నూనెకీ జతకదా, మరి నువ్వు నెయ్యి వేయించుకున్నా వేం" అని అన్నపూర్ణమీద పరియాచకం విసిరాడు.

'పోనీ, నువ్వు చింతకాయపచ్చడి అయినా వేయించుకున్నావు కావేం?" అని అన్నపూర్ణ బదులు తీర్చింది.

"దొరికిపోయావు" అన్నట్టు అవ్యవధానంగా అందుకుని "పచ్చడి పచ్చడి" అంటూ రాచ్చిప్ప చూపించడమే గాని వడ్డించడం యేదేః" అని గంగమ్మ ముదలకించింది,

దీనిమీద ముసలమ్మ విజయగర్వం చూపించుకోగా రంగమ్మ "మొగ పెళ్ళివారికి వచ్చిన పాట్లవి" అన్నట్టు కొడుక్కేసి చూస్తూ అలవోకగాచిరునవ్వు నవ్వుకుంది.

ఇలాగ, మొత్తానికి, పరిసరాలు మళ్ళీ మామూలుస్థితికి వచ్చేశాయి.

దీంతో, నిలిచిపోయిన జగ్గప్ప ధోరణి కూడా మళ్ళీ మామూలు స్థితికి వచ్చేసింది.

"అయితేనూః" అంటూ మళ్ళీ అందుకున్నా డతను.

"రొమేష్ అన్నా వేమిటోయ్ నీపేరుః"

"అవును మామయ్యా"

"ఏం రామేశం అన్న పేరు పనికివచ్చింది కాదూః"

"అందులో అర్థంలేదు మామయ్యా! రాముడికి ఈశ్వరుడేమిటి, తెలివి తక్కువ కాకపోతేః"

"వ్యుత్పత్తి అంతా పెల్లగించేశావేః" అన్నట్టు రొమేష్‌కేసి వెటకారంగా చూశాడు రామేశం.

"మరి రొమేష్ అంటే యేమిటిః"

"లక్ష్మీదేవికి భర్త అన్నమాట"

"అమ్మయ్యా" అన్నట్టూపిరితీసుకుంది జానకి, అన్నపూర్ణకేసి చూస్తూ.

విశాఖపట్నంలో తహస్సీలుదారుగా వున్న జగ్గప్ప తమ్ముడి కూతురి పేరు లక్ష్మీదేవి. ఆమె యూనివర్శిటీ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతూ వుండడమూ, తండ్రి ఆమెని రొమేష్ కివ్వాలని ప్రయత్నిస్తూ వుండడమూ, కోడలు నలుపయితే కులం అంతా నలుపవుతుందన్న భయాన గంగమ్మ తిరస్కరిస్తూ వుండడమూ-అదంతా మరో చిన్నకథ.

జానకీ అన్నపూర్ణా ఆ గొడవలో వుండగా "ఏభాష అదీః" అనడిగాడు జగ్గప్ప.

"సంస్కృతం" అన్నాడు రొమేష్, ఇంగ్లీషు పండితుల వుచ్చారణతో.

జగ్గప్ప ప్రకాశంగానూ, రామేశం స్వగతంగానూ "ఆ" అని వొక్కమాటే చకితులై, అపహారించి, వొకరికేసి వొకరు చూసుకుని వొక్కమాటే ఘంధహాసం చేసుకున్నారు.

తరవాత "రొమా + ఈష్ ఊనా?" అని తాపీగా అడిగాడు జగ్గప్ప,

"అవును"

"రొమా" అంటే?"

"లక్ష్మి అన్నమాట ఈష్ అన్నది యీశశబ్ద వికృతి"

"రమా? రొమా?"

"ఉత్తరదేశంలో రాతలో రమా అనే వుంటుంది; కాని పలుకుబడి రొమా అని"

"ఉన్నది వున్నట్టే పలికితే యేం?"

"పనికిరాదు. సంస్కృత భాషా సంప్రదాయం ప్రకారం "రొమా" అనే పలకాలి. మన వాళ్ళకి హ్రస్వాకారంయెలా పలకాలో తెలియదు"

"అయ్యో?"

"అయ్యో అంటే? ఈవిషయంలో మనలో మహా మహా వ్యాకరణ శాస్త్ర వేత్తలం అనుకునేవాళ్ళుకూడా ఉత్తరదేశపు హీనజాతులపాటయినా యెరగరు"

"బాగుంది.......అయితే, అ అలు యెలా పలకాలంటావోయ్?"

"ఒ ఆ" అని

చకితుడై రామేశంకేసిచూస్తూ అలవోకగానవ్వాడు జగ్గప్ప.

రామేశం రొమేష్‌ని వింతచూపులు చూశాడు. కాని యీ రెండూ పూర్తికాకుండానే అందుకుని "మరి అంత తెలిసినవాడు కదా, "ఒఆఅని" అంటా దేమిటిబావ, నాన్నారూ? ఒఆ, ఒని ఒనాలి కాదండీ?" అనడిగింది అన్నపూర్ణ.

హాలంతా పకపకలు కమ్మేశాయి.

ఒక్కక్షణం వూరుకుని "అయితే మాత్రం, రొమేష్ అనడం యెందుకూ? రామేశం అనవచ్చునే?" అని మళ్ళీ అడిగాడు జగ్గప్ప.

దానిమీద "కోశం పాశం లేశం" అన్నట్టు యీశం యేమిటి మామయ్యా?" అని కొంచెం వెటకారంగా బదులడిగాడు రొమేష్.

"ఎంతగొప్ప ప్రశ్న వేశాడో నాయన చూసుకో" అన్నట్టు సగర్వంగా చూసింది ముసలమ్మకేసి గంగమ్మ.

అది చూసి "హూష్" అంది అన్నపూర్ణ వంటింటికేసి చూస్తూ, పిల్లి వచ్చినట్టూ, దాన్ని గదుముతున్నట్టూనూ.

ఉలిక్కిపడిచూసి, రత్తమ్మా రంగమ్మా చిరునవ్వు నవ్వుకుంటూ, ఝెగాలు పంచుకున్నారు.

అన్నపూర్ణ సమయజ్ఞతకి చాలా ఆనందించాడు; గాని జగ్గప్పకి అంతటితో తృప్తికాలేదు.

"అయితే, నువ్వీ తెనుగుపాశా లన్నీ విడిపించుకో తలుచుకున్నా వన్న మాటా?" కొంచెం నిష్ఠురంగా అడిగాడతను రామేష్‌ని.

"అదీ అడగవలసినమాట" అనుకున్నాడు, మొగంవంచుకుని రామేశం.

ఈమాటతో రామేష్‌కి చిరాకు పుట్టింది.

పైగా, రొట్టె విరుచుకుంటూ, అందుకోసం వంచుకున్న మొగంపైకెత్తుకోకుండానే "అన్నమాటే" అనేశాడు, నిర్లక్ష్యంగా అతను.

దీంతో, రత్తమ్మకీ జగ్గప్పకీ హృదయాలు నిండిపోయాయి; కాని కడుపులు నిండక, కొంతసేపు ఏకాగ్రచిత్తంతో భోజనం చేశారు.

జానకమ్మ వికారం వస్తున్నట్టు బాధపడుతూ, కళ్ళుమూసుకునీ, మొగం పైకెత్తుకునీ గోడకి చేరబడిపోయింది.

ఇదంతా పరిశీలిస్తూవున్న రంగమ్మ, కొడుకు ప్రశ్నార్థక దృష్టులతో తన ఆశాదృక్కులు మిళితం చేసింది.

ఈసమయాన చారుతెచ్చి, అందరికీ అన్నంలోనూ, కొందరికి గిన్నెలలో కూడాను వడ్డించి "అక్కర్లే"దని రామేష్ఉ చిన్న పురుములాంటి గదుము గదమగా అదలి బేజారయిపోయి, యెగిరి వంటింట్లో పడింది వంటలక్క.

"చూశారా?" అన్నట్టు రత్తమ్మ చూడగా "నువ్వూరుకో" అన్నట్టు బదులుచూసి "చాలా బాగుంది, చారుపుచ్చుకోవోయీ" అని రామేష్‌ని ప్రోత్సహించాడు జగ్గప్ప.

"చారు పుచ్చుకుంటే పైత్యం విరిగిపోతుంది, పుచ్చుకో నాయనా" అని ముసలమ్మ కూడా చెప్పింది.

అయినా రామేష్ఉ అందు కంగీకరించలేదు.

అంతటితో వూరుకోక, మొదట, ధుమధుమలాడాడు.

తరవాత "వెధవచింతపండు దేశం, దరిద్రం" అంటూ చెండుకున్నాడు.

నిర్విణ్ణుడై "అదేమిటోయ్?" అనడిగాడు జగ్గప్ప.

"ఈచింతపండు వాడకంవల్ల, ఉత్తరదేశంవాళ్ళు, మన వాళ్ళని పురుగుల కింద కట్టేశారు మామయ్యా"

"ఎంచేతో?"

"రక్తం విరిచేస్తుంది చింతపండు"

"మరి వాళ్ళ గుడుగుడు ముద్దా, భంగూ మంచివా?"

"దీని కేం చెబుతా" వన్నట్టు కోరచూపులు చూశాడు రామేశం.

కాని భోజనం తొందర నటిస్తూ బదులు చెప్పడం మానుకున్నాడు రొమేష్.

అయినా వూరుకోక జగ్గప్ప రెట్టించాడు.

"వాటిలో నాకు తప్పు కనబడలేదు మామయ్యా! పైగా, అవి వైభవానికీ భోగానికీ గొప్ప గుర్తులని కూడా చెప్పవచ్చు. ఎంచేతంటే, వాటిలో చాలా విలవయిన వస్తువులు పడతాయి"

"నీకూ వాటి అలవాటుందా మరి?"

ఇది విని జానకి చకిత కాగా, అన్నపూర్ణ, తానూ ఆమాట నిక్కచ్చిగా అడుగుతున్నట్టు చూసింది.

"దొరికిపోయాడు" అన్నట్టు తల్లికేసి చూసి రామేశం చిరుదగ్గు నటించాడు.

"కొంపతీసి అయిందనేస్తాడేమో" అని గంగమ్మ కొడుక్కేసి బిక్కూ బిక్కూ చూసింది.

ముసలమ్మ కూడా చాలా ఆదుర్దాపడిపోయింది.

అప్పటికి నెమరు తిరగ్గా "అక్కడి శీతోష్ణస్థితి కవి అవసరం మామయ్యా" అన్నాడు చివరికి రొమేష్.

"అలాగే, యిక్కడి శీతోష్ణస్థితికి చింతపండు అవసరమేమో?"

ఇలా అడిగి మేనమామ తనకేసి నిలవ తీస్తున్నట్టుచూడగా, బుర్ర వంచుకుని, రొమేష్‌ఉ, భోజనం తొందర నటించాడు.

రొమేష్‌లాగ కాక. జగ్గప్ప, నిజంగానే అప్పుడు భోజనం తొందర అనుభవించాడు.

ఒక్కక్షణం నిశ్చలంగా భోజనమున్నూ చేశాడు.

తరవాత మళ్ళీ మెల్లిగా అందుకున్నాడతను.

"అక్కడివాళ్ళు అనపాకులూ. గుమ్మడాకులూ పులుసులో వేసుకుంటారు కాదుటోయ్?"

"ఆ, వేసుకుంటారు. ఏం వేసుకుంటే?"

"అబ్బే నాకేం? వాళ్ళేమి వేసుకోడానికయినా మనలాగే స్వతంత్రులు. ఆ రుచే నీకూ అలవాటయిందేమో తెలుసుకుందామని-అంతే"

జవాబు చెప్పలేక, రొట్టెముక్క కొంచెం పెద్దదిగా విరిచి నోట పెట్టుకున్నాడు రొమేష్.

"అక్కడి బ్రాహ్మలు చేపలు తింటారు కాదూ?"

ఈ మాట తల్లికేసి చూస్తూ అడిగాడు జగ్గప్ప.

"అవును, తింటారు. తినక వాళ్ళకేం? శాస్త్రంలో తినవచ్చు ననే — కాదు — తినమనే వుందిట. మనవాళ్ళు వుల్లిపాయలు తింటారు, అది శాస్త్ర నిషిద్ధంట"

కొడుకిలా చెప్పగా, గంగమ్మ "ఏం, తీరిపోయిందా?" అన్నట్టు తల పంకిస్తూ జగ్గప్పకేసి చూసింది.

జగ్గప్ప అది కనిపెట్టాడు.

వెంటనే అతను కూడా తలపంకించి "శాస్త్రం నువ్వు చూశావా?" అనడిగాడు.

"లేదు, చూసినవాళ్ళు చెప్పారు"

"తినగూడదని, చూసినవాళ్ళు యిక్కడా చెబుతున్నారేమో మరి?"

"ఇక్కడి పండితులూ వొక పండితులేనా?"

దీనిమీద గంగమ్మకేసి చూస్తూ "అయితే, ఆవిషయంలో నువ్వుకూడా-అక్కడి వాళ్ళతో పాటు — శాస్త్ర సమ్మతంగానే" — అని తలవూపుకుంటూ చూపులతోటే మాట పూర్తి చేశాడు జగ్గప్ప.

ఇది విని రామేష్‌కేసి చూసి జానకి వెలపరించుకుంది.

వొళ్ళు జలదరించుకుంటూ మొదట కళ్ళు మూసుకుని, తరవాత రామేష్‌కేసి చురుకూ చురుకూ చూసింది అన్నపూర్ణ.

రంగమ్మా, రామేశమూ అపవారించి ముక్కులు బిడాయించుకున్నారు.

"ఏం, మనమడుగారి వరస బాగుందా?" అన్నట్లు ముసలమ్మకేసి చూసి తల అడ్డంగా వూపుకుంది రత్తమ్మ.

నోరు తెరుచుకుని ముసలమ్మ గంగమ్మ కేసి ఆత్రంగా చూసింది, కొయ్యయిపోయి.

అప్పటికి, రామేష్‌ఉ, తల్లియింగితం గుర్తించి జవాబు చెప్పడం మానేసి, కుడిచేత్తోటే గళాసు అందుకుని మంచినీళ్ళు పుచ్చుకోవడం తొందర నటించాడు.

ఇది జగ్గప్పకి మరీ అపస్మారంగా కనపడింది.

చకితుడై రామేశం తనకేసి చూడ్డంవల్ల అతను కొంచెం వుద్రిక్తుడున్నూ అయినాడు; కాని అది సమాళించుకుని, మెల్లిగానే అందుకుని "భోజనం చేశాటప్పుడు కూడా ఉత్తరదేశం వాళ్ళు కుడిచేత్తోటే మంచినీళ్ళు పుచ్చుకుంటారా యేమిటోయ్? అనడిగాడు రామేష్‌ని.

"అవును, పుచ్చుకుంటారు. అక్కడివాళ్ళు, ఎప్పుడూ, యేదీ కూడా యెడమచేత నోట వుంచుకోరు"

"కొళాయినుంచో, యేటినుంచో, నూతిలోనుంచో మంచినీళ్ళు పట్టుకునేటప్పుడూ, రొట్టెలు చేసుకునేటప్పుడూ కూడా యెడమచెయ్యి తగలనివ్వరు కామోసు నేం వాళ్ళు?"

రొమేష్‌ఉ మొగం వంచుకుని వూరుకున్నాడు.

రంగమ్మా రామేశమూ ఇది గమనించివుండనట్టే నటించారు; గాని వాళ్ళ యెదట యిలాంటి సంభాషణ వచ్చినందుకు గంగమ్మ చాలా యిదయిపోయింది.

అది ములుకు నాటినట్టు కాగా, ముసలమ్మ "అదేమిట్రా అలాంటి వికట ప్రశ్నలు వేస్తావు?" అని నిష్ఠురంగా అడిగింది జగ్గప్పని.

దానిమీద "లేదమ్మా లేదు, ఏదో కులాసాగా — మనం ముక్కూ మొగమూ యెరగని దేశంకాదూ అదీ? అంచేత, అక్కడి ప్రజల గొప్పతనమూ వైభవాలూ విని ఆనందిద్దామని – పోనీ, యిక వెయ్యనులే" అని సద్దిచెబుతూ మొగం వంచుకున్నాడు జగ్గప్ప.

కాని, అవ్యవధానంగా అందుకుని, అన్నపూర్ణ "పాపం, చూడనివాడు బావ యేంచెప్పగలడు, నేను చెబుతాను వినండి నాన్నారూ? మరేం? మొదట యిద్దరాడాళ్ళు యెదురెదురుగా కూచుంటారండి. ఇంటో రెండోఆడది లేకపోతే మొగుడూ పెళ్ళాలే అలా కూచుంటారండి. ఊతంకోసం అయిద్దరూ యెడమ చేతులు కింద ఆనుకుని, కుడిచేతులతో పిండిపిసికి ముద్దలు చేస్తారండి. తరవాతా? వాటిలో వొకముద్ద వొకళ్ళ చెంపమీద వొకళ్ళుంచుకుని అయిదువేళ్ళ ఆనవాళ్ళూ బాగా అంటేదాకా ఫెడీఫెడీ చరుచుకుంటారండీ" అని తండ్రికిచెప్పి "కదూ, నాన్నమ్మా" అంటూ ముసలమ్మని బెల్లించింది.

ఈ బంతిలో వాళ్ళందరూ విరగబడి నవ్వుకున్నారు.

గంగమ్మ విషపునవ్వు నవ్వింది.

రొమేష్‌ఉ చాలలేని నవ్వు నవ్వాడు.

దీంతో, వుడుకుమోత్తనం రాగా "నువ్వు చూసొచ్చావు లంజికానా"అని ధుమధుమలాడుతూ మొగం ముడుచుకుని, ముసలమ్మ, ఉప్పుపిండీ వంకాయ పులుసు పచ్చడీ గబగబా కలిపేసింది.

ఒక్కనిమిషం నిశ్చలంగా వెళ్ళిపోయింది.

పరమాన్నం వెండిగిన్నెలలో తెచ్చి అందరికీ విస్తళ్ళ దగ్గిర వుంచింది వంటలక్క.

మళ్ళీమళ్ళీ వేయించుకుని అందరూ ఆప్యాయనంగా పుచ్చుకున్నారు; కాని రామేష్ఉ, కాస్త కాస్త చొప్పున రెండుమాట్లు చప్పరించి, గిన్నె దూరంగా పెట్టేశాడు.

అది అతనికి సయించలే దని గుర్తించి, గంగమ్మ, మరో గిన్నెతో పాలుతెమ్మని పుచ్చుకోమంది.

హిందీలోనే అంది పుచ్చుకోమని.

దాంతో, యెక్కడలేని రుచీ పుట్టుకువచ్చింది రామేష్‌కి.

వెంటనే ఆ గిన్నెకూడా కుడిచేత్తోటే అందుకుని, మధ్య మధ్య వూదు కుంటూ నిశ్శేషంగా పుచ్చేసుకుని, హిందీ వూతపదంతో గ్రరున తేన్చి, తన భోజనం అయిపోయినట్టు సూచిస్తూ గోడపీటకి చేరబడ్డా డతను.

భోజనం అయిపోయాక, తక్కినవాళ్ళింకా తింటూనే వుండినా, వూరికే కూచోడం తనకొడుకు దర్జాకి భంగకరమని వూహించి, గంగమ్మ "నీభోజనం అయిపోయింది వెళ్ళిపో నాయనా" అని హిందీలో చెప్పింది.

అదేమిటో యెరక్కపోయినా, రామేష్ఉ యిక అక్కడే బీడీ అంటిస్తా డేమో అని శంకించి, జగ్గప్పకూడా "నీభోజనం అయిపోయినట్టుంది వూరికే కూచోడంయెందుకూ, లేవ్వోయ్" అన్నాడు.

ఈమాట రావడమే తడవుగా వెండికంచంలోనే చెయ్యి కడిగేసుకొని, కట్టుకున్న అడ్డచారల లుంగీ ఆకంచానికి రాసుకునేటట్టు బయలుదేరి, జేబులో చెయ్యిపెట్టి అగ్గిపెట్టీ బీడీ తీసుకుంటూనే వూచలాగ చక్కాపోయాడు రామేష్.

"మావాడియెదట నువ్వెంతవాడవురా పక్షీ" అన్నట్టు రామేశంమీద వొక నిరాసకంచూపు విసిరేసి, గంగమ్మ దర్జాగా భోజనం అందుకుంది.

## 4

తాంబూలచర్వణం చేసుకుంటూ జగ్గప్ప మేడమీదికి వచ్చాటప్పటికి, గుప్పుగుప్పున బీడీపొగ విడుస్తూ, అతి దర్జాగా రామేశా న్నేమిటేమిటో అడు గుతూ "జానకి నాసొత్తురా బికారీ" అని కళ్ళతో డెకారిస్తూన్నట్టు చూస్తూ, అతి దర్జాగా పచారుచేస్తున్నాడు రామేష్.

సోఫాలో కూచుని వార్తాపత్రిక చూస్తూ, వొక్కొక్క ప్రశ్న వినిపించు కోనే వినిపించుకోక, వినిపించుకున్నా వొక్కొక్క ప్రశ్నకి జవాబు చెప్పక, చెప్పినా ఆదర్జాను మించిన తిరస్కారంతో వుండుండి సగంసగం మాటలతో వినపడీ వినపడకుండా బదులుచెబుతూ, మధ్యమధ్య నసాళం అంటి జవాబు

తోచక బుర్రతిరిగిపోయేలాగ గదుముతున్నట్టు యెదురు ప్రశ్నలు వేస్తూ, "కాకి ముక్కుకి దొండపండులాగ జానకి యేమిటి నీకేమిటిరా పకీరూ" అని వెటకారం చేస్తున్నట్టు కళ్ళు చికిలించి చూస్తూ తన నిర్లక్ష్యం కనబరుస్తున్నాడు రామేశం.

మేనమామని చూడగానే, రామేశం, పత్రిక మేజామీద పడేసి నిటారుగా కూచున్నాడు; కాని రొమేష్‌మాత్రం బీడీ కాల్చడమూ మానలేదు, టెక్కూ తగ్గించుకోలేదు.

ఇద్దర వాలకమూ నిదానించి చూస్తూ, వెళ్ళివెళ్ళి జగ్గప్ప రామేశం దగ్గిర కూచున్నాడు.

మెరుపుదీపాల గుబురులో గూడుకట్టుకుంటున్న పొట్టిపిచికి కిచకిచ లాడుతూ రెక్కలాడించి, రొమేష్ నెత్తిమీద వొక గడ్డిపరక రాల్చింది.

"ఈసంవత్సరం రాబడి యేమాత్రమోయ్?" అనడిగాడు, రామేశాన్ని జగ్గప్ప.

"నిరిటికంటే యెక్కువే రావచ్చు మామయ్యా?"

"నిరుడు?"

"నామట్టుకి పద్దెనిమిది వందలు"

"కోసెయ్" అనుకున్నాడు రొమేష్.

హిందీలోనే అనుకున్నాడు.

"కొత్తకేసుల్లో పెద్దఫీజువి——"

మాటసగాన ఆపి, జగ్గప్ప, ప్రశ్నార్థకంగా చూడగా "రెండున్నాయి మామయ్యా! ఒకటి రెండువందలదీ మరోటి మూడువందల పాతికదీనీ" అని బదులు చెప్పాడు రామేశం.

"మూడువందల కేసు పెద్దకేసుట. దరిద్రుడు" అనుకున్నాడు రొమేష్, ఏవగించుకుంటూ.

"ఈసంవత్సరం——"

"ఇప్పటికి యిరవై మూడువందలు వచ్చాయి. మార్చి ఆఖరుకి మరో మూడువందలయినా రావచ్చు"

"బాగుంది"

"ఒక్క తమాషామాత్రం వుంది మామయ్యా!"

"ఏమిటోయ్?"

"ఆకేసులో మానాన్నగారూ మాబావా అటూ, నేనిటూనూ"

"భేష్! తండ్రినే యెదిరిస్తున్నా వన్నమాట"

రామేశం మందహాసం చేశాడు,

"ఆకేసులో మీనాన్నకి ఫీజు ఏమాత్రం?"

"ఆయనా ఈమాత్రంవాడే" అనుకున్నాడు రొమేష్.

"మానాన్నారికి అయిదువందలయాభై. మాబావకి నూటయాభై"

వీరిలా మాట్లాడుకుంటూండగా ముసలమ్మ వచ్చింది.

జగ్గప్పా రామేశమూ లేచి నుంచున్నారు.

ముసలమ్మ వెనక్కి తిరిగి చూడగా, అదెందుకో అని జగ్గప్పా రామేశమూ కూడా అలాచూడగా, రొమేష్‌ఉ, గట్టిగా పొగపీల్చి సన్నధారగా మెరుపు దీపంబుడ్డిమీదికి వూతున్నాడు.

మొగం పక్కకి తిప్పుకుని రామేశం చిరునవ్వు నవ్వుకోగా, జగ్గప్ప, తానది చూడనట్టు నటిస్తూ "రామేశానికి నిరుడు రెండువేలు కిట్టాయిటమ్మా" అన్నాడు తల్లితో.

జగ్గప్ప. ముసలమ్మ యిందుకు తప్పకుండా ఆనందిస్తుందనుకున్నాడు.

అభిమానం అటేవుండినా, మాటమట్టుకయినా "సంతోషం" అంటుం దనుక్కున్నాడు రామేశం.

కాని, ముసలమ్మ, చురచుర చూస్తూ "నువ్వోమాటు కిందికి వెళ్ళరా" అనిపెటుగ్గా ఆజ్ఞాపించింది రామేశాన్ని.

"అయింది పెళ్ళి" అనుకుంటూ అపవారించి రామేశంమీద పళ్ళుకొరికి, రొమేష్‌ఉ, మరో బీడీ ముట్టించాడు.

జగ్గప్ప తెల్లబోయాడు; కాని రామేశం యేమీ జరగనట్టే నిశ్చలంగా కిందికి వెళ్ళిపోయాడు.

వెంటనే యెదటి సోఫాలో చతికిలబడి "గంగమ్మ కొడుక్కి భూముల మీదే రెండువేలు వచ్చిపడతాయి కాళ్ళదగ్గిర" అంది ముసలమ్మ.

"అతని కేమమ్మా, బంగారుపిచికి"

"అతగాడికి నెలకి రెండుమూడు వేలదాకాజీతం వచ్చే వుద్యోగమే అయిపోతుందిట. మొదటినెలలోనే అయిదువందలకి తక్కువ కాకుండా యిస్తారుట"

"కావాలి. చాలా సంతోషం"

"ఎంతలేదన్నా సంవత్సరాని కిరువై వేలయినా నిలవ చేయిస్తుంది తల్లి"

"గంగమ్మక్కి పొదుపు నేనెరగనూ?"

"మరి నీతో మాట్టాడాలంటోంది అది"

"అభ్యంతరం యేమీ, వెడదాంపద" అంటూ, గభీమనిలేచి "యిక్కడే మాట్లాడుతుంది" అని ముసలమ్మ చెప్పగా "బాగుంది" అంటూ మళ్ళీ కూచున్నాడు జగ్గప్ప.

వెంటనే "మీఅమ్మ నిక్కడికి పంపవోయ్ నాయనా" అని ముసలమ్మ చెప్పడమూ "గొం-గామాయ్" అని పిలుస్తూ మడమలు తాటించుకుంటూ రామేష్ కిందికి వెళ్ళడమూ, ముసుగు సవరించుకుంటూ గంగమ్మపైకి రావడమూ వరసగా, గబగబా జరిగిపోయాయి.

"కూచోవమ్మా" అన్నాడు జగ్గప్ప.

గంగమ్మని తనపక్కని కూచోపెట్టుకుంది ముసలమ్మ.

మెల్లిగా చిరునవ్వు మొలిపించుకుని, అతిదర్జాగా అందుకుంది గంగమ్మ.

"నన్నూ అబ్బాయినీ మీబావ పంపించారోయ్"

"బావగారుకూడా వస్తున్నా రనుకున్నాను."

"పెద్దకేసులే కాదూ అతనికెప్పుడూ వుండేవీ? అంచేత రాలేకపోయాడుట" అంది ముసలమ్మ.

"తాము రావడానికి వీలులేకా, ఆగడానికి వల్లకాకా ముందు నన్నుపంపించారు" అంది గంగమ్మ.

"అయితే, పెద్దపనే అన్నమాట"

"అవతల బావా, వేలుగడిస్తున్నాడు. ఇవతల నువ్వా వందలు గడిస్తున్నావు. మీకిద్దరికీ వుండేది పెద్దపని కాకపోతే చిన్నపని యెలా అవుతుందిరా?" అంది ముసలమ్మ.

"నీ ఆశీర్వచనం" అన్నాడు జగ్గప్ప, మోడ్పుకేలితో.

"అబ్బాయికి సంబంధాలమీద సంబంధాలు వచ్చిపడిపోతున్నాయి తమ్ముడూ" అంది గంగమ్మ చూపుల్లో ఐశ్వర్యగర్వం కనపరుచుకుంటూ.

"అందులో ఆశ్చర్యం ఏమిటమ్మా?" అన్నాడు జగ్గప్ప.

"పెట్టిపుడితే తప్ప జమీందార్లకయినా దొరుకుతాడా నీకొడుకువంటి పెళ్ళికొడుకు?" అంటూ గంగమ్మ వీపు నిమిరింది ముసలమ్మ.

"నాలుగువేలదాకా కట్నమూ, అయిదారు వందలదాకా లాంఛనాలూ పలుకుతున్నాయోయ్"

"పలకా? అమ్మ చెప్పినట్టు మీకేం తక్కువమ్మా?"

దీనిమీద గంగమ్మ మొగాన గర్వరేఖ తళుక్కుమంది.

అది చూసుకుని పొంగిపోతూ, మహారాణీ తల్లిలాగ ముసలమ్మ దర్జాగా సోఫాకి చేరబడింది.

చూసిచూసి "అవేమీ నాకిష్టంలేదు తమ్ముడూ" అంది గంగమ్మ, భ్రాతృ వాత్సల్యం గుమ్మరిస్తూ.

"అదేమీ?" అన్నాడు జగ్గప్ప, చకితుడైనట్టు నటిస్తూ.

దీనిమీద ముసలమ్మ అందుకుని "అదేమిట్రా నాయనా అలా అంటావు? ఇక్కడ జానకి వుండగా అక్కడ మరోపిల్ల నెలా చేసుకుంటుందిరా అక్కయ్య?" అంటూ సాగతీసుకుంది.

"అదా? అయితే, మరీసంతోషం" అన్నాడు జగ్గప్ప.

"తథాస్తూ అనిపించుకుందామనీ, ముహూర్తం స్థిరపరిపించుకునే వెడదామనీ వచ్చాను నేను"

"ఓః నీకా అధికారం లేకపోలేదు"

దీనికి తానూ చాలా ఆనందించి "ఇక నువ్వూరుకో" అన్నట్టు గంగమ్మని జనాంతికంగా గిల్లి, కంఠం సవరించుకుని "నాయనా" అంటూ అందుకుంది ముసలమ్మ.

"నువ్వు లోటుచేస్తావనికాదు; గాని నీ నోటిమాట విందామని నా వుబలాటం"

"నీ కడ్డేమిటమ్మా?"

"లోకం హర్షించాలి. అక్కయ్య స్వతంత్రిస్తూ వున్నందుకు బావకూడా వోహో అనాలి"

"మరి తనని బావే పంపాడంది అక్కయ్యా?" అనడిగాడు జగ్గప్ప, కనుబొమ్మ లెగరవేసుకుంటూ.

దీనిమీద గంగమ్మ కంగారుపడి "అదేమిటే అలా అందుకున్నావు?" అన్నట్టు తనకేసి ఆత్రంగా చూడగా "అది కాదు నేనన్న"దని ముసలమ్మ మళ్ళీ అందుకుంది.

"ఇక్కడికి రావడానిక్కాదు అక్కయ్య స్వతంత్రిస్త, కట్నం సంగతీ, లాంఛనాల విషయమూ తనయిష్టం వచ్చినట్టు పరిష్కారం చేసుకోడానికి"

"అక్కయ్య కెప్పుడూ వుంది స్వతంత్రం, ఇవాళ కొత్తా అది నేనెరగనిదా?"

ఈమాటలో తన గొప్పతనమే గుర్తించుకుంది గంగమ్మ.

"కనక - చెప్పాను కాదూ? నీనోట విందామని—"

అర్థోక్తిలో అందుకుని "నేను డబ్బే పావనం అనుకుంటున్నాననుకోకు. అవతల తరుముకువస్తున్న వాళ్ళు పెదవి విరవకుండా వుండాలి. సహాధ్యాయులు అబ్బాయిని తీసికట్టుగా చూడకుండా వుండాలి. అంతే నాకు ముచ్చట" అంది మెల్లిగా గంగమ్మ.

పక్కకి చూస్తూ వూరుకున్నాడు జగ్గప్ప.

ఒక్క క్షణం చూసి, అప్పటికీ బదులు రాకపోగా "ఆలోచించుకోనియ్యమ్మా" అంది ముసలమ్మ, గంగమ్మని.

అయినా జగ్గప్ప మాట్లాడలేదు.

ఇటు చూడనైనా చూడలేదు.

అది సహించలేక, ముసలమ్మ "జగ్గప్ప చేసే మొదటి కార్యం యిదే కాదూ? అంచేత, అనుభవం లేకా యీ జాప్యం, ఒక్క మేడకట్టాడు, అంతేనా?" అంది గంగమ్మతో.

గంగమ్మ తలవూపి వూరుకుంది, జగ్గప్ప యింగితం కనిపెడుతూ.

అప్పటికీ జగ్గప్ప చలించలేదు.

"రెండువేలడిగారు నీమామగారు, అప్పటి కదేగొప్ప. వెంటనే యిచ్చానన్నారు మీనాన్న, జాప్యంచేస్తే, యెంతమంది కనిపెట్టుకునివున్నారో అవతల, సంబంధం తక్కనిస్తారా? అప్పుడలా యిచ్చాం కనకనే నువ్విప్పుడు మహారాణివై -" అని జగ్గప్పకేసి చూసింది, ముసలమ్మ.

ఉండుండి, పులుకూ పులుకూ చూస్తూ జగ్గప్ప ప్రారంభించాడు-

"సంబంధం విషయమై నీకేమీ అభ్యంతరం లేదు"

"శాస్త్రం చెప్పినట్టుంది, నా కభ్యంతరం యేమిటోయ్?"

"ఇక డబ్బు—"

"నేను నిక్కచ్చి చేస్తున్నాననుకునేవు సుమా!"

"అబ్బా, నీ ధోరణేనీదీ, పరాయి సంబంధం మాట్లాడుతున్నట్లు భావిస్తావేమిటమ్మా? ఒక్కసంగతి ఆలోచించు. కట్నం లేకుండా నేనూ జానకినెవరికీ యివ్వను కట్నం లేకుండా నువ్వూ యెవర్నీ చేసుకోవు నీకొడుక్కి, అవునా?"

"అవునా అంటే—"

దీర్ఘం తీసితీసి చివరకి మాట నాన్చేసింది గంగమ్మ.

ఈ సమయాన, యిందుకోసమే రంగమ్మ కూడా వచ్చి వుండకపోతే గంగమ్మ కీతటపటాయింపు లేకపోవును.

కాని "మాట పూర్తిచెయ్యి" అన్నట్టు చూస్తూ, జగ్గప్ప తలపంకించి వూరుకున్నాడు.

ఇది చూసి ముసలమ్మ చాలా యిదయిపోయింది.

తీరా ముచికొ్కాడికి వచ్చిన వ్యవహారం యిలా స్తంభించిపోవడం ఆమెకి సుతరామూ బాగుండలేదు.

అంచేత, ఆమెకూడా చూసిచూసి "వ్యవహారాలు వచ్చినప్పుడు ముఖావాలూ, అనుకోడాలూ పనికిరావు; కాని మొగాడవు నువ్వు కూడా యింతపట్టు పడితే యెలాగరా? నువ్వేలాగా కట్నం యివ్వతలుచుకున్నప్పుడా యివ్వతలుచుకున్నదెంతో చెప్పేస్తే యేం?" అనడిగేసింది.

తల్లి యిలా అనేటప్పటికి మాటలోమాట కలిపి "నువ్వు యివ్వవలసినవాడవూ, నేను పట్టుకువెళ్ళవలసిన దాన్నీని. నువ్వెంత యిస్తే నేను కాదంటానుః తమ్ముడూ?" అని బెల్లిస్తూ జారిపోయిన ముసుగు ముందుకు లాక్కుంది గంగమ్మ.

జగ్గప్పకి చర్రుమంది.

అప్రయత్నంగా గంగమ్మ ముసుగుమీదపడి అతనికళ్ళు చిమచిమలాడాయి.

భోజనాలసమయాన, రామేష్ ప్రసంగంవల్ల అతని హృదయంలో అయిన గాయం చెయ్యిపెట్టి కెలికినట్టయింది.

వెంటనే చురచుర చూస్తూ "అయితేనూ?........... వచ్చినప్పటిణ్ణుంచీ చూస్తూనే వున్నాను; గానీ.... నీకా ముసుగేమిటమ్మా?" అని గంభీరంగా అడిగాడతను

గంగమ్మా ముసలమ్మా కూడా అతని ధోరణి గ్రహించలేకపోయారు. అంచేత ఇది విని ముందు చిరునవ్వు నవ్వేసింది గంగమ్మ.

తరవాత, జగ్గప్ప నుద్దేశించి "కూపకూర్మం. ఏమి తెలుసునూ?" అన్నట్టు తల్లికేసి నిరాసకంగా చూసింది.

చివరికి, గంభీరంగా చూస్తూ "ఉత్తరదేశంలో సంసారికి ముసుగు లేకపోతే చాలా తప్పట. నలుగురూ గుడ్లుపీకేస్తారుట, అబ్బాయి చెబితే నేనూ వేసుకుంటున్నా"నని సగర్వంగా చెప్పేసింది.

"అవునురా నాయనా! నేను కాశీ వెళ్ళినప్పుడు చూశాను కాదూ? అమ్మాయి చెప్పింది నిజమే" అని ముసలమ్మ అది బలపరిచింది.

"మనది దక్షిణదేశం కాదుటమ్మా?"

"అయితే?"

"ఇక్కడ ముసుగువేసుకోడం యెలాంటి వాళ్ళు?"

జగ్గప్ప ఇలా అడిగాటప్పటికి ముసలమ్మకి భోధపడింది.

దాంతో, మనస్సు చివుక్కుమంది.

వెంటనే అందుకుని "మనం వుత్తరదేశంవాళ్ళమూ, పోసీ అంటే ఆదేశంలో వున్నామా? ఇక్కడ ముసుగెందుకమ్మా?" అని గంగమ్మని లాలించి "రేపణ్ణుంచి మానేస్తుందిలే నాయనా" అని జగ్గప్పకి సద్దిచెప్పింది ముసలమ్మ; కాని జగ్గప్ప మాట అలా వుండగా, ఇందుకు గంగమ్మే యిష్ట పడలేదు.

పైగా "యిలాంటి సంగతులు నీకేం తెలుసునే నాకు చెప్పడానికీ?" అని తల్లిని ముదలకించిం దామె.

"అయితే, యిందుకు బావగా రంగీకరించారా?"

"మీబావ అంగీకరించకపోతే మాత్రం, దేశదేశాలు తిరిగిన నాయన మాటకొట్టెయ్యనా? కాకపోయినా, మీబావగారి కేం తెలుసునూ? ఏలూరూ రాజమండ్రీ తప్ప నూడోవూ రెరుగునా ఆయన? 'లా' కోసంకామోసు చెన్నపట్నంలో రెండేళ్ళున్నారు, అంతేనా?"

"విన్నావా?" అన్నట్టుచూశాడు ముసలమ్మ కేసి జగ్గప్ప.

గట్టిచిక్కే; కాని చూసిచూసి జగ్గప్పని కుర్రకుంకగా కట్టేసిం దామె.

ఈ దిలాసాతో "పోనిస్తూ వారే, మనపిల్ల సుఖమూ దర్జా చూసుకోవాలి గాని వాళ్ళేం చేసుకుంటే మనకేం? ముందు కట్నం సంగతి తేల్చేస్తూ నువ్వు" అని కొడుకునే నెపపెట్టింది.

జగ్గప్ప తల తిరిగిపోయింది.

ఒక్కక్షణం కళ్ళు మూసుకునీ మొగం వంచుకునీ వుండిపోయా డతను.

ఆలోచించి ఆలోచించి యిక వీళ్ళతో మాట్టాడకూడ దనుకున్నాడు; కాని మనస్సు కెళ్ళించింది.

చూడగా, వాళ్ళనెత్తిన చెయ్యిపెట్టడాని కిదీ వొకమార్గంగానే కనపడిం దతనికి.

వెంటనే "నిన్ను 'గౌం—గామాయ్' అని పిలుస్తా దేమిటమ్మా నీ కొడుకూ?" అంటూ మెల్లిగా అడిగాడు.

దీనిమీద గంగమ్మ "హాయి హాయి" అనుకుంది. "గుర్తించారు వీళ్ళు; కాని కారణం యేమి తెలుసుకోగలరూ యీ గుడ్డిపాములూ?" అనుకుని చాలా గర్వించింది.

దీంతో "ఏమిటో?" అంటూ ముందు నవ్వేసింది.

తరవాత "మా తోటికోడలి పేరు మంగమ్మ కాదూ? నా నాయనకి ఆవిడమీదకూడా నామీదవున్నంత భక్తివుంది. అంచేత మా యిద్దరిలోనూ భేదం తెలవడానికీ, మమ్మల్ని చూసి యీ మంచిపద్ధతి యితర్లు నేర్చుకోడానికీ, ఆవిణ్ణి "మొం — గామాయ్" అనీ, నన్ను "గొం — గామాయ్" అనీ పిలుస్తాడు నాయన. ఆదేమిటో ఆపిలుపు వింటే నాకు ప్రాణాలు లేచివస్తాయి. మాతోటి కోడలు పొంగేపోతుంది" అంది కళ్ళు తిప్పుకుంటూ.

"అలా పిలిస్తేగాని నీకు ప్రాణాలు లేచిరావూ?"

"ఎలా లేచివస్తాయోయ్ నువ్వు మరీనీ? హిందీ మాట్లాడేవాళ్ళే హిందువులు. అసలు, బ్రాహ్మలంటే ఆర్యులుట. అంచేత, హిందీలో మాట్లాడుకోకపోతే మనకి బ్రాహ్మణ్యమే నిలవదుట"

"బ్రాహ్మణభాష హిందీభాషా?"

"బ్రాహ్మలేమిటి రాముడూ కృష్ణుడూ పాండవులూ కూడా హిందీభాషే మాట్లాడే వారుట"

"బాగుందమ్మా బాగుంది"

"నానాయన పోరుమీద ప్రాథమిక్ పరీక్షలో నెగ్గి నేనిప్పుడు విశారద్ పరీక్షకి చదువుతున్నాను"

"అది కూడానా?"

"తులసీదాసు రామాయణం కాస్తయినా చదవకుండా నేను పచ్చిమంచి నీళ్ళయినా పుచ్చుకోడం లేదిప్పుడు"

"కొన్నాళ్ళు వాల్మీకి రామాయణం—"

"అది వెనకటి మాట. నానాయన నాకెప్పుడు సత్యం బోధపరిచాడో అప్పణ్ణుంచీ వాల్మీకం విడిచిపెట్టేసి, తులసీదాసు రామాయణమే పారాయణ చేస్తున్నాను"

"చాలా బాగుంది"

"నానాయనతో నేను హిందీలోనే మాట్లాడాలి, లేకపోతే నాప్రాణాలు కొరికేస్తాడతను"

"సంతోషం"

"నేను హిందీ మాట్లాడితే అచ్చంగా హిందీఆడాళ్ళు మాట్లాడినట్టే వుంటుందిట. నేనా దేశం వెళ్ళానంటే చాలా గౌరవం చేస్తారుట నాకు వాళ్ళు"

అవ్యవహితంగా "మామ్మే, మాతల్లే" అంటూ అందుకుని "నీకెంతెంత

గౌరవా లయినా జరగవలసిందే. చిన్నప్పణ్ణుంచీ నువ్వు మహాతెలివయినదానవే. నువ్వా దేశం వెళ్ళాటప్పుడు నన్ను కూడా తీసుకువెళ్ళమ్మా, చూసి ఆనందిస్తాను" అంటూ గంగమ్మని కౌగలించుకుని మురిసిపోయింది ముసలమ్మ.

గంగమ్మ మొగాన విజయగర్వం అలుముకుపోయింది.

వారి ఆనందానికి భంగం కలక్కుండా వొక్క క్షణం వూరుకుని, తరవాత "అయితే మాత్రం "గాం – గా" అనడం యెందుకూ? "గంగా" అనకూడదూ?" అనడిగాడు జగ్గప్ప.

"అనకూడ" దంది గట్టిగా గంగమ్మ.

"గాంగ" అంటే తెనుగులో శత్రువు అన్న మాట, తెలుసా?" అని మళ్ళీ అడిగా డతను.

"వెధవతెలుగు పోనిస్తూ తమ్ముడూ" అంటూ చెండుకుని ఆమె మొగం పక్కకి తిప్పకుందామె.

"సెబాస్" అన్నాడు జగ్గప్ప.

ఇలా అని సకలసంశయాల భారమూ తీరిపోయినంత తేలిక అనుభవిస్తూ సోఫాకి చేరబడ్డా డతను.

ముగ్గురూ వొక్క క్షణం మౌనంగా వున్నారు.

ఈ మౌనంతో జగ్గప్ప అసంతృప్తుడయి వున్నా డని గ్రహించింది ముసలమ్మ.

దీంతో, వెంటనే లేచి "రాత్రి అబ్బాయీ కోడలూ ఆలోచించుకుని పొద్దున్నే తాంబూలా లిస్తారులే తల్లీ" అంటూ గంగమ్మని లేవదీసి కిందికి తీసుకుపోయిం దామె.

జగ్గప్ప తెనుగు జాతి భవిష్యత్తు ఆలోచించుకుంటూ అలాగే వుండిపోయాడు.

ఈస్థితిలో "అత్తయ్య చెప్పారు, ఎందుకూ రమ్మన్నారుటా?" అనడుగుతూ వచ్చిన రత్తమ్మ అతని పక్క కూచుంది.

తెల్లపోయి "నేను రమ్మన్నానూ?" అనడిగా డతను.

"అత్తయ్య చెప్పారు మరి?" అని బదు లడిగిం దామె.

ఆమెకేసే చూశాడు; గాని ఆలోచించా డతను.

అంతా బోధపడింది.

తల్లి ఆదుర్దాకి నవ్వున్నా వచ్చింది.

ఆనవ్వుతో హృదయం తేరుకుంది.

ఆ తేరుదల మెదటికి చురుకు పుట్టించింది.

దాంతో కొడుకు హిందీలో పిలిస్తే గంగమ్మకి వచ్చే సంబరంహాట జ్ఞాపకం వచ్చింది.

ఇది మనస్సును చమత్కరించింది.

వెంటనే "రాత్ తా మాయ్" అంటూ గుచ్చి కౌగిలించుకుని, ఆమెని దగ్గిరసా తీసుకున్నా డతను.

అమాంతంగా నవ్వు పొంగుకురాగా, కిలకిల్లాడుతూ అతని వొడిలో వాలింధామె.

## 5

"సరే సరే" అంటూ రత్తమ్మ వెంటరాగా రంగమ్మ వచ్చి కారులో కూచుంది.

రామేశం కూడా కూచున్నాడు.

"సమయానికి వొంటరిదా న్నయిపోతున్నాను నేను, తొరగా రావాలి సుమండీ" అని ప్రాధేయపడుతూ రత్తమ్మ తలుపువేసింది.

కొబ్బరికాయలూ, అరటిపళ్ళూ, కుంకుమ పొట్లాలూ, హారతి కర్పూరమూ – ఇంకా యిలాంటివీ వున్న పళ్లెం తెచ్చి అన్నపూర్ణ రంగమ్మ కందించింది.

తల్లి యింగితం గుర్తించి రామేశమే చెప్పబోతూవుండగా, ఇంజన్ స్టార్టుచేసి, స్టీరింగుచక్రం పట్టుకుని "సెలవా?" అన్నట్టు వెనక్కివిరగబడి చూచాడు డ్రయివరు.

జవాబు చెప్పడానికి బదులు "మామయ్యా" అని ఆత్రపడుతూ ముందుకి చూశాడు రామేశం.

చూడగా, హుకుంపేటదాకా షికారువెళ్ళివచ్చిన జగ్గప్ప కారుముందు నుంచుని వున్నాడు.

దిగుదామని డ్రయివరు తలుపు తీసుకోబోతూ వుండగా "కోటిలింగాలకీ, మార్కండేయస్వామిగుడికీ వెడుతున్నారు చిన్నవదిన" అంటూ పక్కకి వచ్చి నుంచింది రత్తమ్మ, మడ్‌గార్డు పట్టుకుని.

"శుభం" అంటూ జగ్గప్ప తప్పుకున్నాడు.

కారు కదిలింది.

* * *

"అమ్మగారు వర్తమానించా" రని మెట్లమీది కెదురువచ్చాడు, అరుగు మీద నుంచున్న సంగీతోపాధ్యాయుడు.

"ఎందుకో?"

"అమ్మాయి పాటపాడాలిట"

జగ్గప్ప గంభీరంగా చూడగా, రత్తమ్మ మొగంవంచుకుంది దిగులుగా.

ఇద్దరూ గుమ్మం దాటారు.

"అమ్మగారు సిద్ధంగా వుండమన్నారు." అంటూ పళ్లెంలో అక్షింతలు కలుపుతూ యెదురువచ్చి పక్కగా నుంచున్నాడు పురోహితుడు.

జగ్గప్ప గంభీరంగాచూడగా, రత్తమ్మ చిరాగ్గా చూసింది.

ముగ్గురూ మౌనంగా నుంచున్నారు.

చూడగా మండువాకి వుత్తరపుహాలంతా జంబుకానా పరిచి వుంది.

దానిమీద, పడమటిగోడకి చేర్చి తివాసీ వుంది.

దానికి మధ్యగా బాలీసు.

పాటకులు వుత్తరాభిముఖంగా కూచోడాని కనువుగా తివాసీ అంచున, ఫిడేలు పెట్టి తంబురా వున్నాయి.

తివాసీ తూర్పు అంచుదగ్గిరగా అగరువత్తులు కూజా ఘుమ ఘుమ లాడిపోతుంది.

దానిపక్కనే తాంబూలపు పళ్లెం వుంది.

అదంతాచూసి జగ్గప్ప విభ్రాంతు డయిపోయాడు.

"పదిగడియలకు దుర్ముహూర్తం. అంచేత - తొరగా—" అని మాట తేల్చేశాడు పురోహితుడు.

"ఏమిటిదంతా?" అన్నట్టు జగ్గప్పా "మరేమి టనుకున్నారూ?" అన్నట్టు రత్తమ్మా చూసుకున్నారు.

కోర్టులో, స్వపక్షంగానూ పరపక్షంగానూ కూడా యెక్సాపర్టీ డిక్రీలు ఎన్నో చూసివున్న జగ్గప్పకి తల గిర్రున తిరిగిపోయింది.

దాంతో అప్రయత్నంగా కళ్ళు మూతలుపడ్డాయి.

ఇది గుర్తించి పురోహితుడు చకితుడయిపోయాడు.

అదిన్నీ చూశాటప్పటికి రత్తమ్మకి, గొంతుకు నొక్కుకు పోయినట్ల యింది.

ఏదోపనిమీద వుత్తరపు వసారాలోకి వెడుతూ, వీరి వాలకం ఆకర్షించగా, యిటేచూస్తూ పనిమనిషి, అడుగులు తడబడుతూ వెళ్ళడంలో తలుపు మీదపడగా ఫెడీమని చప్పుడయింది.

దాంతో, ముగ్గురూ ప్రకృతిలో పడ్డారు.

దంపతులు పుంఖానుపుంఖంగా చురుకుచూపులు చూసుకుంటూ మేడ మీది కెగిరిపోగా, కాళ్ళీడ్చుకుంటూ పురోహితుడు తాంబూలపు పళ్ళెం కేసి వెళ్ళాడు.

*　　*　　*

భోజనాలహాల్లోకి తీసుకువెళ్ళి, కుడిచేత్తో రెక్కా, యెడమచేత్తో గడ్డమూ పట్టుకుని "పెద్దబావ వింటాడు, నువ్వూ అక్కయ్యా చక్కగా పాడండి తల్లీ" అని బెల్లించింది ముసలమ్మ; కాని "నేను పాడనుబాబూ" అంటూ మూతి బిడాయించుకునీ, రెక్క విడిపించుకునీ, రెండడుగులు వెనక్కి వేసింది అన్నపూర్ణ.

"నాతల్లివి కాదూ? మాఅమ్మ పేరు పెట్టుకున్నాను కాదూ నీకూ? నామాట వినవూ? గంగమ్మత్తయ్య పే — ద్దబహూమతీ చేస్తుందమ్మా, ఇంచక్క పాడు, ఏం?" అని మళ్ళీ బెల్లించింది ముసలమ్మ; అయినా, నిర్లక్ష్యంగా మళ్ళీ బుర్ర తిప్పేసింది అన్నపూర్ణ.

మొదట యిది అపశకునంగా భావించి మండిపడి, మిగిలివున్న రెండు దంతాలూ కొరుక్కుంది ముసలమ్మ.

తరవాత అసలు చెడుతుందేమో అని నిదానించింది.

"పోనీ, అదిగో, గూట్లో సిద్ధంగా వున్నాయి పళ్ళెమూ హారతి కర్పూరమూ అవ్వీ, నేను చెప్పినప్పుడు వెలిగించుకువచ్చి, అక్కయ్యకీ బావకీ నివాళి ఇయ్యమ్మా" అని చివరికి బతిమాలింది; కాని యిది విని మొదట తుళ్ళిపడి, రాత్రి జరిగిన సంభాషణతో మొగం తిరిగిపోయి వుండడంవల్ల, తరవాత, ముసలమ్మ కంటేనూ మండిపడి చివరికి "పో" అంటూ తుర్రుమంది అన్నపూర్ణ.

దీంతో, కొట్టినంత అభిమానపడిపోయింది ముసలమ్మ.

వెనకాలే వెళ్ళి వీపు చీరేద్దామా అన్నంత రోషంకూడా తెచ్చుకుంది; కాని అంతలో కొంచెం తగ్గి "నువ్వు పాడక పోతేనూ నివ్వాళీ యివ్వకపోతేనూ దిగడిపోతుందా యేమిటి, మీఅమ్మ చేతే యిప్పిస్తాను వాళ్ళకి మంగళహారతి, పో లంజా" అని రుంజుకుంటూ గంగమ్మ దగ్గరికి వెళ్ళిపోయింది.

*　　*　　*

తంబురా శ్రుతిచేసి యథాస్థానంలో వుంచి, తాను పిడేలు శ్రుతి చేసుకుని సిద్ధంగా కూచున్నాడు సంగీతోపాధ్యాయుడు.

దీర్ఘాలోచనతో మొగం కుంగిపోయివుండగా, బరువుగా అడుగులు

వేసుకుంటూ వచ్చి, తంబురా పక్కగావున్న స్తంభం ఆనుక్కూచున్నాడు జగ్గప్ప.

రామస్మరణ చేసుకుంటూ వచ్చి మండువా అంచున కూచున్నాడు పురోహితుడు.

గళ్ళలుంగీ చుట్టబెట్టుకుని, బీడీలకట్ట బరువుకి వూగిసలాడి పోతున్న పట్టులాల్చీమీద పొట్టికోటు తొడుక్కుని, నెత్తిన లేసుగుడ్డటోపీతో యువరాజుల నడక భావించుకుంటూ వచ్చి, సంగీతోపాధ్యాయుణ్ణి రాసుకుంటూవెళ్ళి, వడిసెల బెద్దలాగ తివాసీమీద చతికిలబడ్డాడు రామేష్.

అతని వెనకనే సమంగా ముసుగులు సవరించుకుంటూవచ్చి, ముసలమ్మా గంగమ్మా వుత్తరపుగోడకి చేరబడి కూచున్నారు. పెళ్ళివారి దర్జా చూపిస్తూ.

తరవాత, రెక్కపట్టుకు తీసుకువచ్చి జానకిని తంబురా దగ్గిరకూచో బెట్టి జగ్గప్ప వెనక్కి తప్పుకుంది రత్తమ్మ.

జానకి వాలకం చూసి జగ్గప్ప వులిక్కిపడ్డాడు.

పల్చని నీలజీమూతశకలం లాగ మర్మాంతిక మైన ఆవేదన ఆమె మొగమంతా కమ్మేసివుంది.

పదహారేళ్ళ పిల్ల జానకి.

బంగారుసలాక.

కాని, బేడిసమీలవంటి ఆమెకళ్ళు ఆసమయాన తేజోహీనంగా వున్నాయి.

తీర్చిదిద్దబడే వుండినా, లావణ్యం మరుగుపడిపోయి, వెలిసిపోయిన బిళువారీ అద్దం అయిపోయిందామె మొగం.

అయినా, నిస్తరంగ సముద్రం లాగ అతిగంభీరంగా కూచునివున్నాడు జగ్గప్ప.

## 6

రామేష్ వేషం చూసీ, అతని దురుసుతనం అనుభవించీ, అక్కడి — అప్పటి వాతావరణం భరించకా, సంగీతోపాధ్యాయుడు మందు తిన్నట్టయి పోయాడు.

జానకి మ్లానముఖం చూసి, తాను "గుడికి మేకపోతును తీసుకువెళ్ళే క్షుద్రుని కంటేనూ నికృష్టుణ్ణయిపోయా" నని చాలా బాధపడ్డాడు కూడా అతను.

ఏమయినా, బరువుగానే రెప్పలల్లార్చి జగ్గప్ప ఆజ్ఞ యివ్వగా యీదురో మంటూనే కమానందుకున్నా డతను.

వెంటనే యెప్పు డెప్పు డని యెదురుచూస్తూ వుండినట్టు, కమాను, అవ్యవ ధానంగా ఫిడేలుతీగలు నిమిరింది.

దాంతో, మధురమైన గంభీరఝుంకారం వుప్పతిల్లి, అతని కుత్సాహం రేకెత్తించి, జానకి హృదయతంత్రులు వూపేసింది.

ఉత్తరక్షణంలో, గురువూ శిష్యురాలూ యీక్షుద్ర వాతావరణాని కతీతు లయిపోయారు.

వారి మొగాలు వికసించాయి.

ఈవిధంగా అయినా జానకి మళ్ళీ వుత్సాహవంతురాలయినందుకూ, ఆమె మొగం యథాపూర్వంగా లావణ్యభరితం అయినందుకూ "అమ్మయ్యా" అనుకుని రత్తమ్మా "బతికాం" అనుకుని జగ్గప్పా వూపిరితీసుకుని, వొకర్నొకరు చూపులతో పరామర్శించుకున్నారు.

ఈ సందుబాట్లో కాంభోజిరాగం యెత్తుకుని వుపాధ్యాయుడు టూకీగా వాయించాడు.

అది జానకి కంఠంలో ఆవర్తాలు రేపింది.

దీంతో, అప్పటికి తనకూ అలాంటి అనుభవమే కలగగా తానూ పాడా లని అన్నపూర్ణ గుబగుబలాడిపోయింది; కాని దానివల్ల ముసలమ్మకోరిక నెరవేరి పోతుందని మనస్సు బిగపట్టుకుని — అయినా ఆగలేక, నాయనమ్మ కంట బడకుండా వుండేటట్టు కుంచుకుపోయివచ్చి జానకి పక్కన కూచుంది.

ఇది జానకికి ఝంఝూమారుతంలో జవజవలాడిపోయే యేల కితీగకి అవలంబం దొరికినట్టయింది.

రత్తమ్మ యిందు కానందించిన్నీ "నువ్వు పాడవద్దుసుమా" అని అన్న పూర్ణని కళ్ళతో నిషేధించింది.

ఇది యెరగని జగ్గప్ప కూడా ఆమెని అలాగే కళ్ళతో వారించాడు "నువ్వు పాడవ" ద్దని.

తరవాత, వుపాధ్యాయుని కుడిపాదం సూచించగా, అన్నపూర్ణ "ఇంతే" అన్నట్టు తల్లికేసి చూస్తూ రూపకతాళం అందుకుంది.

జానకి "యితర దైవములవల్ల, నిలను సౌఖ్యమా" అని త్యాగరాజ కీర్తన యెత్తుకుంది.

ఆయెత్తుగడ చూసి జగ్గప్పా రత్తమ్మా చకితులయినార్ను.

అరగంట చూస్తూ 'రామా, రామా," అని ఆక్రోశిస్తున్నట్టు రాముణ్ణి సంబోధిస్తూ "మతభేదము లేక సదా మదిని మరులుగొన్న తన కితరదైవముల వల్ల సౌఖ్యమా?" అని అనుపల్లవి జానకి సంగతులువేసి పాడినప్పుడు రత్తమ్మ హృదయం ఆనందముగ్ధం అయిపోయింది.

మడికట్టుకుని దేవపూజ చేస్తున్నట్టు కూచునివున్న జానకిని చూసిన కంటితో, లేసుగుడ్డ టోపీ పెట్టుకొని మిఠాయి అంగడిమీద కూచునివున్నట్టున్న రామేష్‌ని చూడలేకపోయాడు జగ్గప్ప.

రామేష్‌కూడా మొగం ముడుచుకునే వున్నాడు.

ఈకృతీ యీఫణితీ చూడగా అతనికి చీమలూ జెర్రలూ పాకినట్టుంది.

"నా పెళ్ళాం పాడుతుం"దని బడాయి చెప్పుకుని యిలాంటి పాట వుత్తర దేశంవాళ్ళకి వినిపించి యిక తలయెత్తుకు తిరగ్గలమా?" అని తహతహలాడి పోతున్నాడతను.

"చింతపండు పులుసుకీ దీనికీ భేదం యేమి" టని కూడా అతను యీసడించు కుంటున్నాడు.

ఈ భావం కలగ్గానే వుపాధ్యాయునిమీద యెంతయినా అసహ్యభావం కలిగిం దతనికి.

"పోవయ్యా నేర్చుకు పోయావు, మహా – " అని దులిపెయ్యా లన్నంత ఆగ్రహం ముంచుకు వచ్చిం దతనికి.

అయితే, యీసమయాన, పోర్టికోలో కారు ఆగినచప్పుడు వినవచ్చింది.

మరొక్క క్షణానికి కారు తలుపు వేసేసిన చప్పుడున్నూ అయింది.

దీంతో, అతను శాంతించడం తప్పనిసరి అయిపోయింది.

ఉత్తరక్షణంలో, స్నానంచేసి పట్టుతాపితా కట్టుకుని, మొగాన గోవిందం బొట్టుంచుకుని కుడిచేత్తో దేవతాప్రసాదం కొబ్బరికాయ చెక్క పట్టుకుని రామేశం వచ్చాడు.

దేవతాప్రసాదం పళ్లెంలో వుంచుకుని, అలాగే మడిగా, అతని వెనకనే రంగమ్మకూడా వచ్చింది.

వారినిచూసి, తాను నోరుజారి వుండనందుకు చాలా ఆనందించాడు రామేష్.

అప్పటికి "మనసు దెలిసి బ్రోచినను మరచినను నీవే. తనవా దన తరుణ మిదే, త్యాగరాజ సన్నుత" అని చరణం పూర్తిచేసి, స్వరం చేస్తోంది జానకి.

వారి రాకతో రత్తమ్మ మొగం వికసించింది.

జగ్గప్ప యేదో పెద్దఆసరా దొరికినట్టు విలక్షణానుభూతి పొందాడు.

అన్నపూర్ణ యెగిసిపడ్డట్లయింది.

ముఖ్యంగా, జానకి ప్రాణాలు లేచివచ్చాయి.

ఆమెకి నూతనోత్సాహమున్నూ కలిగింది.

జానకి పాట పోర్టికోలోనే విని రామేశమూ రంగమ్మా చకితులైనారు; కాని అక్కడనుంచోక, ఉత్తరపు హాలుకేసి చూడనైనా చూడకుండా, వచ్చినవారు వచ్చినట్టే ముందు దక్షిణపు వసారాలోకి, తరవాత, అక్కణ్ణుంచి మేడమీదికి వెళ్ళిపోయారు.

అయినా "సమయానికి వచ్చారే శకున పక్షుల్లాగా" అని ముసలమ్మా "వస్తే మాత్రం? కళ్ళల్లో నిప్పులు పోస్తాను చూస్తూ వుండు" అని గంగమ్మా జనాంతికంగా పళ్ళు కొరుక్కుని, ముసుగులు సవరించుకుంటూ మూతులు బిడాయించుకున్నారు.

## 7

పాడినదానికి మెప్పు కనబడక, పాడడానికి మరి యిచ్ఛాలేక "యిక పాడలే"నన్నట్లు జానకి జాలిగాచూడగా "మాఅమ్మవు కావూ? ఇంకొక్కటి" అన్నట్టు రత్తమ్మ కనుసన్న చేసింది.

జగ్గప్ప కూడా "యేదో యింకొకటి పాడెయ్యవమ్మా" అన్నట్టు తల యెగరవేసుకున్నాడు.

"పాడవే మాతల్లీ" అన్నట్టు గునిసింది అన్నపూర్ణ.

జన్మానికల్లా అప్పుడే విలక్షణానందం రుచిచూసిన పురోహితుడు "చిలకలా పాడావు. మరొక్కటి కూడా పాడమ్మా" అని నోరారా అడిగాడు.

దానిమీద, రామేష్టు, మెరుపుకొట్టినట్టయి, పులుకూ పులుకూ చూశాడు; గాని అప్పటికప్పుడే మళ్ళీ శ్రుతి సరి చేసుకుని, జానకి యింగితం గుర్తించి హరికాంభోజి యెత్తుకుని వొక్కవిసురు విసిరాడు సంగీతోపాధ్యాయుడు.

వెంటనే అన్నపూర్ణకి రూపకతాళం అందించి "ఉండేదీ రాముడొకడు - ఊరక చెడిపోకెమనస" అని మళ్ళీ త్యాగరాజు కీర్తనయెత్తుకుంది జానకి, తల్లికేసి చూస్తూ.

అన్నపూర్ణా చిరునవ్వు నవ్వింది తల్లికేసి చూస్తూ.

మొదట చకితుడై, తరవాత మొగం పైకెత్తుకుని స్తంభం ఆసరాతో

వెనక్కివిరగబడి "నీకోసంపాడుతోంది అమ్మాయి ఆకీర్తన" అన్నట్టుచూశాడు, రత్తమ్మకేసి జగ్గప్ప.

రత్తమ్మ మొగం ప్రఫుల్లపద్మం అయింది.

ఉత్కటానందంతో జానకి కణతలమీద చూపులతోనే మెటికలు విరిచి, చూపులతోనే సీమంతం కూడా ముద్దుపెట్టుకుందామె.

ఈ కీర్తన అంటే ఆమెకి నిద్రాహారాలక్కర్లేదు.

తెల్లవారగట్ల, జానకి తనపక్కమీదికి వచ్చి పాడితే యిది విని గాని ఆమె కళ్ళు విప్పదు.

మళ్ళీ రాత్రి కూడా జానకి మంచంమీద కూచుని యిది పాడించుకుని మరీ నిద్రకి వెడుతుందామె; కాని, పెళ్ళిచూపులకోసం యేక కాలంలో యిద్దరు పెళ్ళికొడుకులు వచ్చి వుండడంవల్లా, వారిలో వొకడు ఆంధ్రదేశాతీతుడుకూడా కావడంవల్లా, గతరాత్రీ, ఆవేళ తెల్లవారగట్లా మాత్రం పాడించుకోలేక పోయిందామె.

ఇందువల్ల, యేదో వస్తువుపోయినట్టూ, యేదో లోటు అనుభవిస్తున్నట్టూ ఆమెమనస్సు పీకుతూనే వుంది.

అయితే, యిలాంటి ఆ సందర్భం వచ్చినప్పుడు, అది గడిచిపోయాక యేమి చెయ్యాలో జానకి కెరుకే.

కాగా, వచ్చిన విపత్తు యింకా పీటపెట్టుక్కూచుని వుండగానే యిప్పుడిలాగ చక్కని అవకాశం రావడం ఆమెకి వరం దొరికినట్టయింది.

ఇలాంటి తృప్తితోటీ, ఇలాంటి వుత్సాహంతోనూ

"చండమార్తాండమధ్య—
మండలమునను చెలంగుచుండేదీ"

అని, అనుపల్లవి, సంగతులువేసి పాడసాగిందామె.

బాహ్యదృష్టి మరచిపోతున్నట్టు ఆమెకళ్ళు అరమూతలు పడ్డాయి.

దీంతో, రత్తమ్మకి, విశ్వరూపం కనపడింది.

అప్పటికప్పుడే జగ్గప్ప హృదయం కూడా ఆనందోత్ఫుల్లం అయింది.

"రాముడున్నాడు; కాని యిక్కడ లేడు. ఉన్నవాడు రాముడు కాడు - మహాబాగా తేల్చేశావు తల్లీ" అనుకుని పొంగిపోయాడతను.

ఈపొంగు అతని మొగాన మెరుపయింది.

ఆ మెరుపు జానకి శోణాధరంమీద మల్లెపువ్వులు విరగపూసింది.

దాంతో, జానకి కంఠాన వాగ్దేవి ప్రవేశించినట్టూ ఫిడేలు తీగల మాటున గండుగోయిల నక్కి కూచున్నట్టూ భాసించింది.

ఈస్థితిలో—

"తామసాది గుణరహితుడు,

ధర్మాత్ముడు, సర్వసముడు,

క్షేమకరుడు, త్యాగరాజ

చిత్తహితుడు జగము నిండి - ఉండేదీ"

అని చరణం కూడా పాడింది జానకి.

కంఠం గద్గదికమై, లలాటం స్విన్నమై, మనస్సు పరవశమై హృదయం, ఆనందముగ్ధమై, దృష్టి శ్రీరామనిష్ఠమై పాడిందామె.

ఆమె మొగాన విలక్షణమైన తేజస్సు మెరిసింది.

అది చూసి జగ్గప్పా, రత్తమ్మా మళ్ళీ చకితులైనారు.

పురోహితుడున్నూ ఆగానం విని వూగిపోయాడు.

కాని, గంగమ్మా, ముసలమ్మా ముసుగుల్లోనే కాక, దబ్బురంథిలో కూడా మునిగిపోయి వున్నారు.

ఇందుకు తగ్గట్టు జానకి పాటలో సారస్యం యెక్కువైనకొద్దీ రామేష్ హృదయంలో వైరస్యం పెరిగిపోయింది.

అసలు, రెండో కీర్తనే యెత్తుకోవద్దని మందలించాలనుకున్నాడతను.

ఎలాగా ప్రారంభించింది కనక, తన యింగితం గుర్తించి, జానకి "అది యేదోవిధంగా తేల్చి పాడెయ్యకపోదు" అని కూడా అనుకున్నాడతను. కాని అతనిలా ఆశించేటప్పుడే ఆమె కూడా పరవశ అయిపోయింది.

చివరికి, వుపాధ్యాయుడు కూడా చకితుడయిపోయేటంత గంభీరంగానూ మధురంగానూ పాడిందామె.

ఇది రామేష్ గుండెలమీద కొరడాలాగ తగిలింది.

అత నిక వూరుకోలేక పోయాడు.

దీంతో, వుపాధ్యాయు డిటు ఫిడేలు కింద పెట్టాటప్పడికి, రామేష్ ఉ, మొగమాటం అటు దూరంగా పెట్టేసి "ఇలాంటి పాడుపాటలు నేర్పి మీరెంత మంది పిల్లల్ని పాడుచేస్తున్నారండీ" అని దురుసుగా అడిగాడు.

ఉపాధ్యాయుడు తెల్లపోయాడు.

ఉలిక్కిపడి జానకీ అన్నపూర్ణా గురుపు కేసి చూశారు

రత్తమ్మ స్తంభాని కంటుకుపోయింది.

అప్పటికి జగప్ప ప్రకృతిలో పడ్డాడు.

"ఏమిః" టనడిగా డతను.

"నీవంటివాడు కూడా యిలా పామరత్వం కనపరచడం బాగాలేదు మామయ్యా" అన్నాడు రొమేష్టు.

సరిగా బోధపడక "ఏమిటోయ్ నువ్వనేదీ?" అని మళ్ళీ అడిగాడు జగ్గప్ప.

"ఇది పాట కాదు" అన్నాడు వొత్తి. రొమేష్టు.

జగ్గప్ప మిడుతూ మిడుతూ చూశాడు.

"ఇది సంగీతం అంతకంటే కాదు" అని చెండుకున్నాడు రొమేష్టు.

"ఏమిటీ వుప్పెన?" అన్నట్టుపాధ్యాయుడి కేసి చూశాడు జగ్గప్ప.

ఉపాధ్యాయు దేదో అనబోయాడు; గాని "నువ్వాశ్చర్యపడితే లాభం లేదు" అంటూ అవ్యవధానంగా మళ్ళీ అందుకున్నాడు రొమేష్టు.

"కర్ణాటకగానం అనబడే కూతలతోటీ, త్యాగరాజు పదవపాటలతోటీ, తెనుగుదేశం వొక్కటేకాదు, దక్షిణదేశానికి దక్షిణదేశమే పర్రా దిబ్బా అయి పోయాయి"

"మరి సంగీతం యేదంటావ్?"

"హిందూస్థానీ సంగీతమే సంగీతం"

జగ్గప్ప గతుక్కుమనిపోయాడు.

కర్ణాటకగానం మిక్కిలీ మధురమైనదనీ, చాలా గొప్పదనీ, అది ఆంధ్రుల చేతిలోనే చక్కగా రూపొందినదనీ గుర్తించినవా డతను.

కర్ణాటకగానం ఆంధ్రులకు జాతీయ మూలధనం అని లెస్సగా గ్రహించిన వాళ్ళలో మొనగా డతను.

ఏమాత్రం అవకాశంవచ్చినా చుట్టుపట్ల పట్నాల్లో జరిగే సంగీత సభలకి కూడా వెళ్ళి ఆనందిస్తూ వుంటాడు.

అన్యయశుద్ధీ, రాగభావమూ పోషిస్తూ పాటకుడు పాడుతూవుంటే అతని కిక నిద్రాహారా లక్కర్లేదు; కాని ఆంధ్ర జాతికి స్వస్వరూపజ్ఞానం లేదనీ, ఇరవయ్యోశతాబ్దం సగం గడిచాక గూడా అదిలేకపోవడం హైన్యాం అనేజ్ఞానం కూడా లేదనీ అతనికి బాగా తెలుసు.

కాకపోతే, సంగీతం విని ఆనందించ గలిగేవాడు పరాయి సంగీతమే గొప్పదనీ, మూడు జాతులవారిని పాదాక్రాంతులుగా చేసుకున్న తన సంగీతం అధమం అనీ అనుకునేవాడు ఆంధ్రజాతిలో తప్ప మరెక్కడున్నాడూ.

ఇలా అనుకుంటూ జగ్గప్ప తహతహ లాడిపోతూవుండగా పురోహితుడి కేసి చూస్తూ సంగీతోపాధ్యాయుడు వెటకారంగా నవ్వాడు.

జానికి అన్నపూర్ణా మొగాలు చిట్లించుకున్నారు.

ఈసమయాన "హిందూస్థానీ సంగీతమే శుద్ధహిందూ సంగీతం. అది వినగలిగిందే జన్మ. అది విని ఆనందిస్తేనే రసికత. దాన్ని స్వీకరించి నప్పుడే దక్షిణదేశం వాళ్ళకి మోక్షం, అప్పుడే వాళ్ళకి హిందుత్వసిద్ధిన్నీ" అని మళ్ళీ వొత్తిచెప్పాడు రామేష్‌ఉ.

ఆచెప్పడంలో ఆవేశంకూడా కనపరిచాడు.

"సత్యం ఆవిష్కరించా" ననీ "జాతీయతను దొలిచేస్తున్న చీడపురుగేదో దాన్ని బయటపెట్టగలిగా" ననీ అతను ధన్యవాదాలు కూడా చెప్పకున్నాడు.

దీంతో, జగ్గప్పకి అతని నిజస్వరూపం నిలువునా అర్థం అయిపోయింది.

రత్తమ్మకి తలే తిరిగిపోయింది.

పురోహితుడు తాను మైలపడిపోయినట్టు కించపడ్డాడు.

సంగీతోపాధ్యాయుడు "పురోడాశం తీసుకు వెళ్ళి కుక్కకి పెట్టానుగదా?" అని పశ్చాత్తాప పడిపోయాడు.

ఉబ్బెత్తుగాలేచి జానకీ అన్నపూర్ణా భోజనాల హాల్లోకి వెళ్ళిపోయారు.

"ఏం వెళ్ళిపోతా రేమ్మ్రా?" అని ముసలమ్మ ఆత్రంగా అడిగింది; గాని ఆమె కెవరూ బదులుచెప్పలేదు.

తన కొడుకన్న మాటలలో పరవశ అయిపోయి, మళ్ళీ తల్లి ఆత్రంతో ప్రకృతిలో పడి, గంగమ్మ తల్లి చెవిలో నోరుపెట్టి "ఇలాంటి నోముల పాటలుదే అబ్బాయి యెదట పాడవలసినవీ? చూడు, మూడుముళ్ళూ పడిపోనియ్యి తరవాత జానకమ్మకి యెలాంటిసంగీతం నేర్పిస్తాడో నాయనా?" అని కళ్ళు తిప్పుకుంటూ గొణిగింది.

సరిగా యీ సమయాన, బ్రైగొడ్డు అరుపులాగ హార్మోనియం వాద్యమూ, దాల్లో కలిసి వొక స్త్రీ కంఠమూ విని పించాయి.

అందరూ పులిక్కిపడ్డారు.

రామేష్ మొగం చేట అయిపోయింది.

వెంటనే ద్వారంకేసి తర్జనితో నిర్దేశిస్తూ "అదిగో అదీ సరయిన సంగీతం వస్తా నుండండి" అని చెబుతూనే గభీమని లేచి బయటికి దూకాడతను.

## 8

మేడమీద దక్షిణపుహాల్లో స్తంభంచాటున నుంచుని, వుండుండి మండువా

తెరపిలోనుంచి కిందికిచూస్తూవుండిన రంగమ్మ, సోఫాలో కూచుని నిశ్చింతగా వార్తాపత్రిక చదువుకుంటున్న రామేశాని కిదంతా చెప్పింది.

వింతపడి, మండువా వూచలదగ్గిరికి వచ్చాడతను.

అప్పటికి, రామేష్‌డు "దయచెయ్యండి. అచ్చమైన హిందూ సంగీతం వినిపించి యీ దరిద్రులను అనుగ్రహించండి" అంటూ లోపలికి వచ్చాడు.

ఈ మాటలు హిందీలోనే అంటూ వచ్చాడు.

అతని వెనక, నవారుతాటితో హార్మోనియం మెడకి వేలాడ వేసుకుని పదిహేను పదహారేళ్ళ కుర్రాడు వచ్చాడు.

వస్త్రాదుకట్టు కట్టుకుని, షేర్వాణీ తొడుక్కుని, లేసుగుడ్డ టోపీ పెట్టుకుని-పైగా, మురికి వోడుకుంటూ వున్నాడు వాడు.

వాడి వెనక పది పద్దెనిమి దేళ్ళ యువతి వచ్చింది.

లంగా కట్టుకుని, లాల్చీవంటి చొక్కా తొడుక్కుని, జారు పైటా ముసుగూ వేసుకుని వుందామె.

ఆమె కూడా మురికి వోడుకుంటూనే వుంది.

అక్కడి పరిసరాలు చూసి వాళ్ళొకమాటు మొగ మొగాలు చూసుకున్నారు.

తర్జనితో ఆపిల్ల ముసుగు చూపిస్తూ "చూశావా? ముష్టెత్తుకునే పిల్ల అది; అయినా ముసుగు మానిందా? ముసుగు లేకపోతే ఆదేశంలో గుడి సేటిది అన్నమాట. దేశంఅంటే అదేదేశం. మనదేం దేశమే పాడుదేశమూ?" అనడిగింది గంగమ్మ, అపవారించి ముసలమ్మని.

"పెళ్ళయాక జానకమ్మకి ముసుగువేయిస్తావా?" అనడిగింది, అలాగే ముసలమ్మ.

"ఇంకా అడుగుతున్నావా? పుస్తిముడేసి, ఆచేతులతోటే నాయన, జానకి నెత్తిమీదకి ముసుగు లాగెయ్యడూ?"

"బాగుండదే"

"నువ్వూరుకోవే"

ఇలా అని కళ్ళతో కసిరింది గంగమ్మ.

ఈ వ్యవధిలో వాళ్ళ సాన్నిధ్యం భరించలేక, సంగీతోపాధ్యాయుడు ఫిడేలూ తంబూరా పట్టుకువెళ్ళి పురోహితుడికి ప్రక్కగా కూచున్నాడు.

"ఇదేదో కొంచెం చూసే వెడదా" మన్న ఉద్దేశంతో వెనక్కి వెళ్ళి మరో స్తంభం ఆనుకునుంచుంది రత్తమ్మ.

చురుగ్గా చూస్తూ జగ్గప్ప అలాగే వుండిపోయాడు.

భోజనపుహాలు కిటికీ తలుపులు సగం తెరుచుకుని జానకీ, గుమ్మంలో నుంచుని అన్నపూర్ణా యీమహోత్సవం చూడసాగారు.

జాప్యం సహించలేక "దయచెయ్యండి" అన్నాడు రామేష్‌ఉ, మళ్ళీ హిందీలోనే.

"తల్లీ కూచోండి. ఈకుబేరపుత్రుణ్ణి మెప్పించండి, మీకు నేను బహూమతీ చేస్తాను" అని తివాచీచూపిస్తూ గంగమ్మ కూడా, చెప్పింది, హిందీలోనే.

ముసలమ్మ "యిప్పు డేమిటీ యీమాయసంత?" అని చీదరించుకుంది; కాని గంగమ్మకీ, రామేష్‌కి యెదురు చెప్పలేక కళ్ళప్పగించి వూరుకుంది.

అప్పటికి కూచున్నాడు కుర్రాడు "మంచిది" అని హిందీలోనే అని, తలపంకించుకుంటూనూ హార్మోనియం ముందుకి తీసుకుంటూనూ.

చూసి చూసి యువతి కూడా కూచుంది, లంగా చక్రాకారంగా పడేటట్టు.

వెంటనే హార్మోనియం ఖంయి మంది.

దాంతోనే యువతి ఖంయి మంది,

ఉలిక్కిపడి, తొంగిచూసి, కంఠంనొక్కుకుని "అదేమిటి నాయనా?" అసడిగింది రంగమ్మ, మెల్లిగా.

"పిల్లజమిందారు పెళ్ళికాదుటమ్మా? సంగీతసభ అది" అని బదులు చెప్పాడు రామేశం.

ఈస్థితిలో, పురోహితుడు ఊరికే పైకి చూశాడు.

వా రక్కడే యెందు కుండిపొయారో బోధపడక, అతను, కళ్ళు చికిలించుకుంటూ వారిని సంగీతోపాధ్యాయుడికి చూపించాడు.

పిల్ల పెణక లెగరగొడుతూ వుంటే, వచ్చేదారీ పోయేదారీ తెలవక మహాకవి తెల్లపోయి చూస్తూకూచుని వుండేటట్టు, దిగ్భ్రాంతు డయిపోయి వున్నాడు పాపం అతను.

ఇలాంటిస్థితిలో వారుకనపడగా, రామేశం పరిచితుడయి వుండడంవల్ల "దయచెయ్యండి" అన్నట్టు కన్నుగీటా డతను.

ముందు మందహాసం చేసి "రాకూడదు, తప్పు" అన్నట్టు ముక్కుమీద వేలుంచుకుని, తరవాత, రామేశం, దోలు స్ఫురించేటట్టూ, అది తక్కువైనట్టూ చేసన్న చేసి, చివరికి సోఫామీదికి వెళ్ళిపోయాడు.

దాంతో, ఆకాశగంగ లాగ పురకలు వేసుకుంటూ నవ్వురాగా

మళ్ళీమళ్ళీగమ్మున ఆపుకునీ, వుండుండి వకాలుమనబోయీ వూగిపోయాడు సంగీతోపాధ్యాయుడు మొగం అటు తిప్పుకుని.

ఇక్కడ యిది యిలా వుండగా, అక్కడ ట్రిమ్మిలమీద ట్రిమ్మి లెగిరిపోతున్నాయి.

"సెబాస్" "చాలాబాగుంది" "భలేభలే" "వావా" అని మధ్యమధ్య పాటకత్తెను హిందీలో మెచ్చుకుంటూ "ఏమనుకున్నారు?" "చూసుకోండి" "సిగ్గుపడండి" "బుద్ధితెచ్చుకోండి" అన్నట్టు మధ్యమధ్య ఆడపెళ్ళివారిని కళ్ళతో డెకారిస్తూ, రొమేష్, అభంగ–ఉత్తుంగ–ఆనంద తరంగాలమీద, అలాఅలా తేలిపోతున్నాడు, దూదిపింజెలాగ.

అదిచూసి "వీళ్ళ మొగం వీళ్ళకేం తెలుసు, నిజమైన సంగీతం అదేనే. అది చెవిని పడిందంటే నాయన యికమనలో వుండదే" అని ముసలమ్మతో సొరకాయలు నరికేస్తుంది గొం – గామాయ్.

కొంత సేపటికి యీపొగడ్తా, యీప్రచారమూ బాగా వుత్సాహం కలిగించి యెత్తెయ్యగా, యువతి, ఉబ్బెత్తుగా లేచి నుంచుంది, చీమకుట్టి యెగిసిపడినట్టు.

హార్మోనియం మళ్ళీ మెడకి తగిలించుకుని కుర్రాడుకూడా అంత లాఘవంగానూ యెగిరి నుంచున్నాడు.

ఇద్దరూ పులుకూ పులుకూ చూసుకున్నారు.

పడవ తెడ్లలాగ చేతు లూపుకుంటూ, అవ్యవధానంగా థెయ్యి మని నాటకం తొక్కసాగింది యువతి.

ఆవేశంతో వొకమాటీభుజానికీ మరోమాటు ఆభుజానికీ గడ్డం తగిలేటట్టు మొగం మార్చుకుంటూ మెయిలు వేగం తోటీ అదే నినాదంతోటీ వేళ్ళాడిపోతూ వున్న హార్మోనియం మీటుకుంటూ మెరుపువేగంతో కుర్రాడు ఆమె చుట్టూ తిరగసాగాడు.

ఆ చురుకుతనమూ ఆ చాకచక్యమూ చూసి ముగ్ధుడయి, ఆ నృత్యానికి మరింత మాధుర్యం కలిగించి తద్వారా తాను మరింత ఆనందించగోరి, రొమేష్‌ఉ, కుడిచేతి తర్జనితో నాలుక మడతవేసుకుని యెగరొప్పల్లాగ యీలలు వెయ్యసాగాడు.

ఆ యీలలతో మహోత్సుక అయిపోయి యువతి గిరగిర తిరిగింది.

గిర్రున తిరిగేసింది.

దాంతో, హాలంతా ముఖరితం అయిపోయింది.

ఆకోలాహలంతో యెగిసివచ్చి, సోఫాలో కూచునివున్న రామేశమూ, అప్పటికీ స్తంభం చాటునేవున్న రంగమ్మా మండువా తెరిపి వూచల అంచున కూలబడ్డారు.

శరీరం మరచిపోయి, యువతి, భరతశాస్త్రంలో వున్నవీ లేనివీ కలిపి అడ్డమైన ముద్రలూ పట్టేసింది.

ఇలాగ వొక్క పావుగంట గడిచింది.

చివరికి యెగిరి యెగిరి అలసిపోయి యువతీ, తిరిగి తిరిగి బడలిపోయి కుర్రాడూ చతికిల బడ్డారు.

నాలుక పీక్కుపోయి, రామేష్టు, అరగన్నులతో అప్పటికి అసలైన స్థాయి అందుకున్నాడు.

కొడుకు రసానుభూతి చూసుకుని గంగమ్మ గర్వపర్వత శిఖరం యెక్కేసింది.

వారి యిద్దరి గొప్పతనమూ మరింత బాగా తెలుసుకుని ముసలమ్మ, బోసినూరు తెరచుకుని కళ్ళు తేలవేసుకుంది.

ఆడపెళ్ళివారు, ఏమి జరుగుతోందో తెలవకా, అర్థమే కాకా, చివరికి కనపడకా జడావస్థలో పడిపోయారు.

ఇలాగ, మనుష్యులే కాక హాలంతా కూడా అవ్యక్తావస్థలో భాసిస్తున్న యీ సమయాన, ఎప్పుడు-యెలా వచ్చిందో, నాయనమ్మ చూపించిన పళ్ళెంలో హారతి కర్పూరం వెలిగించుకువచ్చి, తివాసీ అంచున నుంచునివుంది, అన్నపూర్ణ.

వేదజడుడు కావడంవల్ల రసానుభూతి తక్కువకాగా, అందరికంటేనూ ముందుగా మైకం వదలి, పురోహితుడు అమాంతంగా లేచినుంచుని, "శుభకే: శిర ఆరోహ శోభయంతీ ముఖంమమా—" ఇత్యాదిగా మంగళహారతి సామయిక మంత్రం అందుకున్నాడు.

అతని పక్కనే వున్నాడు కనక, ఆ పవిత్రవేద ఘోషతో వుత్తరాది భూతబాధ విముక్తికాగా, వెంటనే ప్రకృతిలో పడి సంగీతోపాధ్యాయుడు, పుణ్యకాలం మించిపోతోందన్నీ అదుర్దాతో గభీమని ఫిడే లందుకుని, ఫెడీమని కమాను వేసి—

"నీనామరూపములకు నిత్యజయ మంగళం"

అన్న త్యాగరాజు సౌరాష్ట్రరాగం కీర్తన యెత్తుకుని, పల్లవి మాత్రం సంగతు లన్నీ వేసి వాయించేశాడు.

అప్పటి కప్పుడే రొమేష్‌కీ యువతికీ కలిపి నివాళి యిచ్చి పళ్ళెంకింద వుంచేసి, అన్నపూర్ణ, భోజనాల హాల్లోకి తుర్రోమంది.

1942 డిసెంబరు భారతినుంచి—

సవరణలతో